స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు

● కలెక్టర్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచిన అధికారులు



ఈవీఎంలు భద్రపరిచి సీజ్ చేసిన గదిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటిటౌన్, మే 14: జిల్లా వ్యాప్తంగా 1609 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలన్నీ రాయచోటిలోని స్ట్రాంగ్ రూములకు చేరాయి. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, అధికారులు స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య భద్రపరిచారు. మంగళవారం కలెక్టర్, ఎన్నికల అబ్జర్వర్‌లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద నుంచి వచ్చిన ఈవీఎంలను పట్టణంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించి నియోజకవర్గాల వారీగా రాజంపేట, కోడూరు, రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె 6 నియోజకవర్గాలకు సంబంధించి పోల్డ్ ఈవీఎంలను శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి సీల్ వేశామని తెలిపారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా అదేరోజు ఉదయం అబ్జర్వర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సీల్ తొలగించి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. అంతవరకు స్ట్రాంగ్ రూముల దగ్గర అత్యంత కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవోలు, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను స్ట్రాంగ్ రూముకు తరలిస్తున్న సిబ్బంది

సుధీర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్

జమ్మలమడుగు, మే 14: జమ్మలమడుగులోని వెంకటేశ్వర కాలనీ ఈద్గా సమీపాన 116, 117 పోలింగ్ కేంద్రంలో సోమవారం రాత్రి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డిపై ఇటుకతో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటలకు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పీఏ కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి నిందితుడు గోనె క్రిష్టారెడ్డిని (50) అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఇతరత్రా విషయాల్లో సోషల్ మీడియాలో ఎవరైనా మెసేజ్‌లు చేస్తే అలాంటివారిపై కేసులు నమోదు చేస్తామని, రూ.లక్ష జరిమానా విధిస్తామని డీఎస్పీ హెచ్చరించారు. జమ్మలమడుగు పట్టణంలో జూన్ 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థులు ఆదినారాయణరెడ్డి, సుధీర్‌రెడ్డిలకు 2 ప్లస్ 2 భద్రతను పెంచామన్నారు. గతంలో ఈ ముగ్గురికి 2 ప్లస్ 2 ఉండగా ఇప్పుడు 4 ప్లస్ 4గా భద్రత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.


కాయ్ రాజా.. కాయ్!

● బెట్టింగ్‌రాయుళ్ల జోరు..

● గెలుపోటములు, మెజార్టీలపైన భారీ పందేలు

● వైసీపీ, టీడీపీ తరఫున పోటాపోటీ

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి.. అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థుల భవిష్యత్తు స్ట్రాంగు రూంలలో భద్రంగా ఉంది. జిల్లాలో దాదాపు 80 శాతం పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పందెంరాయుళ్లు పందేలు కాయడంలో జోరుగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల గెలుపోటములు, మెజార్టీపైన టీడీపీ, వైసీపీ వర్గీయులు పందేలు కాయడానికి పోటీపడుతున్నారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా ఈ బెట్టింగ్‌రాయుళ్ల గురించే చర్చ నడుస్తోంది.



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంటు, పార్లమెంటు పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవరాలపైన బెట్టింగ్‌రాయుళ్ల కన్ను పడింది. ఇక్కడ ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది ? అని పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. రాజంపేట పార్లమెంటు అభ్యర్థి గెలుపోటములపై జోరుగా పందేలు సాగుతున్నాయి. రాజంపేట పార్లమెంటుకు ఇప్పటికే రెండుసార్లు గెలిచిన మిధున్‌రెడ్డి మూడవసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీ అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మిధున్‌రెడ్డి గెలుస్తాడని ఎక్కువగా పందేలు కాస్తున్నారు. వైసీపీ వర్గీయులు పందేలకు కాలు దువ్వుతున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుపైన కూడా పెద్ద ఎత్తున పందేలు జరుగుతున్నాయి. 100కు 75 లెక్కన పందేలు కాస్తున్నట్లు సమాచారం.

● మదనపల్లె నియోజకవర్గంలో వైసీపీ తరఫున నిసార్ అహ్మద్, టీడీపీ తరఫున షాజహాన్ బాషలు పోటీలో ఉన్నారు. ఇక్కడ కూడా ఇద్దరి గెలుపోటముల పైన జోరుగా పందేలు జరుగుతున్నాయి. ఎక్కువగా వైసీపీ అభ్యర్థి గెలుస్తాడనే పందేలు జరుగుతున్నాయి.

● పీలేరు నియోజకవర్గంలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టీడీపీ తరఫున నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలు బరిలో ఉన్నారు. ఇక్కడ ఇరువురి గెలుపు అవకాశాలపైనా జోరుగా పందేలు జరుగుతున్నాయి.

● రాయచోటిలో ఇప్పటికే మూడుసార్లు గెలిచి నాల్గవసారి కూడా గెలవాలని వైసీపీ తరఫున శ్రీకాంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడు. టీడీపీ తరఫున తొలిసారి తన అదృష్టాన్ని పరిక్షించుకోవాలని మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి చూస్తున్నారు. ఇద్దరిలో ఎవరు గెలుస్తారో అనే అంశంపైన ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. ఒకవేళ గెలిచినా మెజార్టీ ఎంత రావచ్చు అని కూడా పందేలు జరుగుతున్నాయి. రాంప్రసాద్‌రెడ్డి గెలుస్తాడనే ఎక్కువగా పందేలు జరుగుతున్నట్లు సమాచారం.

● రాజంపేటలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి వైసీపీ తరఫున, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇక్కడ బాలసుబ్రమణ్యం గెలుస్తాడని ఎక్కువగా బెట్టింగులు జరుగుతున్నాయి. మెజార్టీపైన కూడా బెట్టింగులు జరుగుతున్నాయి.

● రైల్వేకోడూరు నియోజవర్గంలో ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొరముట్ల శ్రీనివాసులు వైసీపీ తరఫున.. కూటమి తరఫున జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ తొలిసారి తన అదృష్టాన్ని పరిక్షించుకుంటున్నాడు. జనసేన అభ్యర్థి గెలుస్తాడనే ఇక్కడ కూడా ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. అయితే వైసీపీ అభిమానులు మాత్రం జిల్లాలో దాదాపు అన్ని స్థానాలను వైసీపీనే గెలుచుకుంటుందని పందేలు కాస్తున్నారు. తమది వంద రూపాయలు అయితే.. ప్రత్యర్థులు రూ.50 అయినా..రూ.70 అయినా సిద్ధమే అంటున్నట్లు సమాచారం.

బెట్టింగ్‌కు కాదేదీ అనర్హం

సాధారణంగా తమ నియోజకవర్గం, తమ జిల్లాలోని నియోజకవర్గాల్లో గెలుపోటములపై పందేలు కాయడం సహజం. అయితే ప్రస్తుతం పందెంరాయుళ్లు మాత్రం కాదేదీ బెట్టింగ్‌కు అనర్హం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో ఈసారి జగన్‌కు మెజార్టీ ఎంత వస్తుంది అని కూడా జోరుగా పందేలు జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈసారి కుప్పం నియోజకవర్గంలో ఎంత మెజార్టీ వస్తుందని పందేలు జరుగుతున్నాయి. అదే విధంగా జనసేనాని పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ గెలుపోటములు, మెజార్టీపైన పెద్ద ఎత్తున పందేలు జరుగుతున్నాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరిపైనా పందెంరాయుళ్లు ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ లోకేశ్ గెలుస్తాడా? ఎంత మెజార్టీ వస్తుంది? అని జోరుగా పందేలు జరుగుతున్నాయి. అదేవిధంగా కడప పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న షర్మిల ప్రభావంపైనా.. ఆమెకు ఏ మేరకు ఓట్లు వస్తాయనే అంశంపైనా బెట్టింగులు జరుగుతున్నాయి. అదేవిధంగా రాష్ట్ర మంత్రులు రోజా, కొడాలి నానిలు పోటీ చేస్తున్న నగరి, గుడివాడ పైనా పందెంరాయుళ్లు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. రోజా ఎంత తేడాతో ఓడిపోతుందని జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. గుడివాడలో కొడాలి నాని గెలుస్తాడా..? ఎంత మెజార్టీ వస్తుంది అని కూడా పెద్ద ఎత్తున బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలో సుమారు 80 శాతం జరిగిన పోలింగ్ తమకు అనుకూలమంటే తమకే అనుకూలమని అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ వర్గీయులు పందేలు కాయడానికి ఉత్సాహం చూపుతున్నారు. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని టీడీపీ వర్గీయులు వాదిస్తున్నారు. అలా కాదు.. పెరిగిన ఓటింగ్ ప్రభుత్వ సానుకూలతకు అద్దం పడుతోందని వైసీపీ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి.

కడప నుంచి గోవాకు ప్రత్యేక బస్సు

కడప (మారుతీనగర్), మే 14 : కడప నుంచి గోవాకు ఈ నెల 24వ తేదీ శుక్రవారం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఈ గోవా ప్రత్యేక సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే వారు డబ్లుడబ్ల్యుడబ్ల్యుఏపీఎస్ఆర్‌టీసీ.ఆన్‌లైన్.ఇన్ లో లాగిన్ అయ్యి గోవా సర్వీసు నెం.50301 బస్సుకు రిజర్వేషన్ చేసుకోవాలని లేదా కడప ఆర్టీసీబస్టాండులో ఉన్న రిజర్వేషన్ కౌంటరు ద్వారా పొందవచ్చన్నారు. ఇంద్ర ఏసీ బస్సుకు టికెట్ ధర పెద్దలకు రూ.3300, పిల్లలకు రూ.2వేలు ఉంటుందన్నారు.

భిక్షగాళ్లలా వచ్చి దోచేస్తారు...

● నిందితులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు




కొత్తయిండ్లు వడ్డిపల్లెలో కర్ణాటకకు చెందిన భిక్షగాళ్లు

మదనపల్లె అర్బన్, మే 14: వారంతా గ్యాంగ్. భిక్షగాళ్లుగా తిరుగుతూ ఇళ్లలోకి జొరబడి మత్తుమందు చల్లి ఇంట్లోని సొమ్మును దోచుకుంటారు. ఇలా మదనపల్లెలోని ఓ ఇంట్లో మంగళవారం రూ.11,500 దొంగిలించడంతో పోలీసులు వారిని పట్టుకుని గుట్టు రట్టు చేసినట్లు తాలుకా సీఐ యువరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు... స్థానిక కొత్తయిండ్లు, వడ్డిపల్లెలో కర్ణాటకకు చెందిన ఏడుగురు పెద్దలతో వారి పిల్లలు భిక్షగాళ్లుగా మదనపల్లెలో తిరుగుతుండేవారు. వడ్డిపల్లెకు చెందిన సబీహ ఇంటి వద్దకు మంగళవారం ఇద్దరి పిల్లలతో కలిసి డప్పులు కొడుతూ యాచన చేస్తూ వచ్చారని, తాగడానికి నీళ్ల ఇవ్వమని అడగగా ఆమె ఇంట్లోకి వెల తీసుకోచ్చేలోపే ఇంట్లోకి ప్రవేశించి రక్తంతో కూడిన మత్తుమందు చల్లడంతో ఆమె వారి ఆధీనంలోకి వెళ్లి రూ.11,500 బీరువా నుంచి ఆమె స్వయంగా వారికి ఇచ్చినట్లు తెలిపారు. అరగంట తరువాత ఆమెకు స్పృహ వచ్చింది. అప్పటికే వారు అక్కడ నుంచి జారుకున్నారు. అనంతరం శేషమహాల్ ముందు ఇద్దరు పిల్లలు యాచన చేస్తూ కనపడడంతో స్థానికులు వారిని పట్టుకుని వారి వద్ద చిన్న సైజ్‌లో ఖురాన్, పసుపుదారాలు, పసుపు స్వాధీనం చేసుకుని వారి టీం వివరాలను సేకరించారు. అప్పటికే కొత్తయిండ్లు, వడ్డిపల్లెల్లో ఉన్నట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి పోలీసులు చేరుకుని ఏడుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి విచారణలో కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా హుంనుబాద్ తాలుకా జోషిగల్లి చెందిన లేట్ కాశీనాథ్ భార్య శకుంతల (65), రేఖా (37), సునీత (43), పూజ (25), జిత్తు (37,) మరో ఎనిమిది మంది మైనర్లు ఉన్నారు. వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. కాగా వీరిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డబ్బును దొంగిలించిన నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మండే ఎండలు..!





మదనపల్లెలో ఎండలతో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

● జనం ఉక్కిరిబిక్కిరి

● పెరిగిన విద్యుత్తు వాడకం

● గిర్రున తిరుగుతున్న మీటర్లు

● బిల్లు చూసి గుండెలు గుబేల్

మదనపల్లె, మే 14: కరెంటు బిల్లులు చూసిన సామాన్యుడి గుండె గుబేల్ అంటోంది. ఇంతకాలం అదనపు బాదుడైన సర్‌చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, తదితర పేర్లతో ప్రభుత్వం ఎడాపెడా వసూలు చేసింది. వాటి నుంచి బయట పడకముందే వినియోగదారుడు తాజాగా ఎండలు, ఉక్కపోత బాదుడు ఎదుర్కొంటున్నాడు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రశాంత, చల్లటి వాతావరణంగా పేరొందిన మదనపల్లె ప్రాంతంలో ఎన్నడూ లేనంతగా రోజువారీ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్, అంతకు మించి నమోదవుతున్నాయి. మండే ఎండలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకూ ఇళ్లలో ఉండలేకపోతున్నారు. ఉదయం 9 గంటలకే సూర్యుడి భగభగలు బయటకు రాకుండా చేస్తున్నాయి. సాయంత్రం 5 గంటలైనా ఉక్కపోత తగ్గడం లేదు. ఫలితంగా పట్టణంలోని ప్రధాన రహదారులే కాదు.. వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఈ క్రమంలో అటు ఎండ నుంచి ఇటు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలతో పాటు చల్లటి గాలినిచ్చే విద్యుత్తు పరికరాలను ఎక్కువగా వాడుతున్నారు. రాత్రింబవళ్లు ఎండ, వేడి, ఉక్కపోతకు తట్టుకోలేక ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్లు, ఏసీల వాడకం ఎక్కువగా ఉంటోంది. 5 నిమిషాలు కరెంటుపోయినా భరించలేకపోతున్నారు. ఇలా కంటిన్యూగా విద్యుత్తు వాడకం పెరగడంతో విద్యుత్తు మీటరు కూడా గిర్రున తిరుగుతోంది. దీంతో యూనిట్లు పెరిగి, స్లాబ్ మారడంతో వినియోగదారుడి గుండె గుబేల్ మంటోంది.

రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో ఈ వేసవిలో ఎండలు మండిపోతున్నట్లు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. వందేళ్ల చరిత్రలో ఇలాంటి వాతావరణ పరిస్థితులు చూడలేదని చెప్పడం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ఏడాదిలో వేసవి ప్రారంభం కాక ముందే ఫిబ్రవరి నుంచి మొదలైన ఎండలు, వేడి, మే నెల ప్రారంభానికి మరింత పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది. దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు వడదెబ్బకు గురై పిట్టల్లా రాలిపోతుండటం చూస్తే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏసీలో ఉండే సంపన్నులు మినహా పేద, మధ్యతరగతి ప్రజలు అటు బయటకు రాలేక, ఇటు ఇళ్లలో ఉండలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వీటన్నింటినీ తట్టుకోవడానికి విద్యుత్తు పరికరాలను ఆశ్రయిస్తే కరెంటు బిల్లు బాదేస్తోంది. అలా.. ఇలా కాదు..ఏకంగా సాధారణ బిల్లు కంటే నాలుగింతలు ఎక్కువగా రావడాన్ని చూసి సామాన్యుడు భయపడుతున్నాడు.

చల్లని గాలినిచ్చే కూలర్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండీషనర్ (ఏసీ)ల వాడకమే కాదు.. వాటి వ్యాపారం కూడా మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కూలర్లు, ఫ్యాన్లనే ఎంపిక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పట్టణంలో కూలర్లకు డిమాండ్ ఏర్పడింది. దుకాణాల్లో తగినంత, వినియోగదారులకు స్థాయి, వినియోగానికి తగిన పరిమాణంలో లేకపోవడంతో స్టాకు వచ్చేంతవరకూ వేచి ఉండాలని దుకాణదారులు సూచిస్తున్నారు. ఈ డిమాండ్‌ను వ్యాపారులు బాగా క్యాష్ కూడా చేసుకుంటున్నారు. కూలర్ కనిష్ఠంగా రూ.11 వేల నుంచి రూ.20 వేలకు అమ్ముతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే, వీటి ధరలు రెట్టింపైనట్లు వినియోగదారులు వాపోతున్నారు. ఇక స్టాండింగ్ ఫ్యాన్ కూడా రూ.2 వేల నుంచి రూ.5వేలకు విక్రయిస్తున్నారు. ఏసీల విషయానికి వస్తే, దాని సామర్థ్యం, స్టేజీ, కంపెనీని బట్టి రూ.38 వేలు-రూ.60 వేలు పలుకుతున్నాయి. పుష్కలంగా వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు వచ్చే వరకూ ఇదే పరిస్థితి ఉంటుందని ప్రజల అంచనా.

● మదనపల్లె పట్టణం బుగ్గకాలువకు చెందిన ఎస్.రామాంజులుకు ప్రతినెలా కరెంటు బిల్లు రూ.400 వచ్చేది. అలాంటిది ఏప్రిల్‌కు సంబంధించిన కరెంటు బిల్లు రూ.1400 వచ్చింది. ఇదేమని ఆరా తీస్తే.. యూనిట్లు పెరగడం, స్లాబ్ మారి బిల్లు తడిసిమోపెడైంది. తాను వాడుతున్నది రెండు లైట్లు, ఒక ఫ్యాను మాత్రమేనని బాధితుడు వాపోతున్నారు.

● మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన రెడ్డెప్పకు నెలనెలా రూ.900లోపు వచ్చే కరెంటు బిల్లు ఏప్రిల్‌కు సంబంధించి మూడు వేలకు పైగా వచ్చింది. ఈయన ఇంట్లో రెండు ట్యూబ్‌లైట్లు, రెండుఫ్యాన్లు, వాషింగ్ మెషిన్ మాత్రమే వాడుతున్నారు. అదనపు చార్జీల బాదుడు ఉన్నప్పుడు కూడా తనకు ఇంత బిల్లు రాలేదని బాధితుడు తల బాదుకుంటున్నాడు. ఒక రామాంజులు, రెడ్డెప్పలే కాదు.. జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులు అందరిదీ దాదాపు ఇదే పరిస్థితి.



మదనపల్లెలోని విద్యుత్తు సబ్‌స్టేషన్

చంద్రబాబు సీఎం కాబోతున్నారు

- రాయచోటిలో టీడీపీ విజయం ఖాయం: మండిపల్లి



మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే 14: ఆంధ్ర రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని, రాయచోటిలో టీడీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు చంద్రబాబు ముఖ్య మంత్రి కాబోతున్నారని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మొదటి విడతలోనే నా పేరును ప్రకటించారని.. అప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు సహకరించిన టీడీపీ నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలియ జేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే రాయచోటి ప్రజల కష్టాలు తీరుస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తానని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా నా కష్టంగా భావించి వారికి అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు సురేశ్, ఖాదర్ మొహిద్దీన్, ఎజాస్, అతావుల్లా, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే విజయం

- కమలాపురంలో టీడీపీ విజయం తథ్యం : పుత్తా



చెన్నూరులో జరిగిన కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, మే 14 : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే విజయమని.. జూన్ 4న అధికారంలోకి రాబోతున్నామని.. కమలాపుంలో టీడీపీ గెలుపు తథ్యం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. చెన్నూరులోని గోసుల కళ్యాణ మండపంలో మంగళవారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో పాటు ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలతో సిక్సర్ కొట్టబోతున్నామని.. టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాల అమలుతో పాటు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మండల టీడీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, రాంకోటిరెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై కసితో ఓట్లు వేశారు..

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే : పుట్టా



విజయకేతనం చూపుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, మే 14: వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఓటర్లు కసితో ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేశారని... వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త నాది గెలుపు అని ధ్యేయంగా పని చేశారన్నారు. తనకు తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడి.. చాపాడులో టీడీపీ ఏజెంట్లపై దాడికి పాల్పడటంపై పుట్టా తీవ్రంగా స్పందించారు. దౌర్జన్యం చేయాలనుకుంటే మేము చేసేవాళ్లం. మాకు ప్రశాంతతే ముఖ్యం అని.. రౌడీయిజం, దౌర్జన్యం చేసి గెలవాలనుకోవడం మూర్ఖత్వం అన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే అని.. వైసీపీ వాళ్లు కవ్వింపు చర్యలకు పాల్పడతారని.. తొందరపడి ఎవ్వరూ ఘర్షణలకు వెళ్లవద్దు.. కౌంటింగ్ వరకు సంయమనం పాటించాలని కార్యకర్తలకు సూచించారు. దాడిలో గాయపడ్డవారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కాగా ఎమ్మెల్యే సొంత గ్రామం నక్కలదిన్నెలో పోలింగ్ ఏజెంట్లుగా కూర్చున్న వారిని ఆయన సన్మానించారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే..

సంక్షేమ పథకాల సొమ్ము ఇపుడు జమచేయాలి

- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించిన టీడీపీ ఏజెంట్లు, కార్యకర్తలు
- పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, మే 14: జగన్ ఎప్పుడో బటన్ నొక్కిన వాటికి ఎన్నికలకు ముందు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు వేసి ఓటర్లను ప్రలోభపెట్టాలని చూడ్డంతో ఎన్నికల కమిషన్ అడ్డుకుందని పులివెందుల ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి పోటీ చేసిన బీటెక్ రవి అన్నారు. ఓటింగ్ ముగిసిందని ఆయనలో చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ పథకాల సొమ్ము ఇప్పుడు జమచేయాలన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందులలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎవరి ఓటు వారు వేసుకునేలా పరిస్థితి కల్పిస్తామని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు తమకే మద్దతు తెలిపారన్నారు. పులివెందులలో ఎప్పుడూ జరగని విధంగా ఫెయిర్ పోలింగ్ జరగడంతో ప్రజలే టీడీపీని అభినందిస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉంటాడనే ఉద్దేశంతో పోలీసు వ్యవస్థ వారికి అనుకూలంగా పనిచేశారన్నారు. వైసీపీ వారు గుంపులు గుంపులుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్నా ఏమీ అనలేదన్నారు. మధ్యాహ్నం 3గంటల తర్వాత వైసీపీ వాళ్లు టీడీపీ ఏజెంట్లను ప్రలోభపెట్టేస్థాయికి దిగజారారన్నారు. అసలు సీఎంకి ఎన్నికలు జరిగాయా లేకుంటే ఎంపీకి జరుగుతున్నాయా అర్థం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుమరుగైన కోహినూర్ దోస

- పెట్టుబడులు కూడా దక్కని వైనం
- మూడేళ్లుగా పంట సాగు చేయని రైతులు

రాజంపేట, మే 14: రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో కోహినూర్ దోస సాగు కనుచూపుమేరలో కానరాకుండా పోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో మూడేళ్లుగా ఈ పంటను సాగు చేయడం రైతులు మానుకున్నారు. ఈ పంట పదేళ్ల కిందట అనంతపురం జిల్లాలో విస్తారంగా సాగయ్యేది. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో అక్కడక్కడా ఈ పంటను సాగు చేసేవారు. అయితే ఆదిలోనే హంసపాదు అన్నట్లు ఈ పంటకు అధిక తెగుళ్ల సోకడం, పంట పాడవ్వడం జరుగుతుండటంతో ఈ పంట సాగు చేయడం పూర్తిగా మానుకున్నారు. గతంలో రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ పంటను విస్తారంగా సాగుచేసేవారు. ప్రస్తుతం ఇక్కడ వంద ఎకరాలకే ఈ పంట సాగు పరిమితమైంది. కష్టమెక్కువ.. ఆదాయం తక్కువ... అన్న చందంగా మార డంతో ఈ పంటను సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. కొందరు రైతులు చేసేది లేక కొద్దిపాటి పంట సాగు చేస్తున్నా గిట్టుబాటు ధరలు రాక పోవడంతో పంటను వదిలేస్తున్నారు.



ఢిల్లీకి ప్రత్యేక లారీలలో బాక్సుల ద్వారా కోహినూర్ దోసకాయలను పంపుతున్న దృశ్యం

ఈ పంట సాగు చేయాలంటే ఒక కిలో విత్తనాలను ఏకంగా రూ.70వేలు పెట్టి కొనుగోలు చేసేవారు. కిలో విత్తనాలు సుమారు 3ఎకరాలకు సరిపోయేవి. 66 రోజుల్లో ఈ పంట చేతి కొస్తుంది. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతుల్లో ఈ పంటను సాగు చేసేవారు. ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్‌కు, విత్తనాల కొనుగోలుతో సేద్యపు ఖర్చులు ఎక్కువగా వచ్చేవి. మల్చింగ్ షీట్‌ను పొలంపై వేసి చిన్నచిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి రంధ్రాలలో విత్తనాలు పెట్టి ఈ పంటను సాగు చేస్తారు. ఈ విధంగా కేవలం ఎకరా సాగుకు లక్ష రూపాయలు ఖర్చు అయ్యేది. ఒక ఎకరాకు 14 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ కాయలను కేవలం ఢిల్లీకే ఎగుమతి చేస్తారు. ఎంతో రుచికలిగి చూడటానికి ఎంతో ఇంపుగా ఉండే ఈ దోస మార్కెట్‌లో మంచి లాభాలను ఇస్తుంది. ఒక లారీ ఢిల్లీకి పంపాలంటే లారీ బాడుగ ఖర్చు లక్ష, ప్యాకింగ్ ఖర్చు 40వేలు ఇతర ఖర్చులు మరో 20వేలు ఉంటుంది. మొత్తం రూ.1.60 లక్షలు దాటుతుంది. ఇక సాగు ఖర్చు కలుపుకుంటే ఒక్కో ఎకరాకు సుమారు 3 లక్షల రూపాయలు ఖర్చు వస్తుంది. అయితే ఢిల్లీకి ఒక్కో లారీకి 1650 బాక్సులను పంపుతారు. మామూలుగా ఒక్కో బాక్సు రూ.400 వరకు ధర ఉంటుంది. అయితే బాక్సు ధర రూ.300లు అంత కంటే తక్కువ ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదు. ఒక్కోసారి కాయలు దెబ్బతింటే లారీకి మరో 50 వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తుంది. ఇక పంట సాగు చేసిన



పెరుమాండ్లపల్లె ప్రాంతంలో సాగుచేసిన కోహినూర్ రకం దోస



ఎగుమతి చేయడానికి బాక్సుల్లో కాయలు వేస్తున్న రైతు కూలీలు

మొదట్లో చీడపీడలు పడినా.. వాతావరణంలో మార్పులు వచ్చినా.. అంతే సంగతులు. పెట్టిన పెట్టుబడి అంతా నేలపైన వదలాల్సిందే.. ఈ విధంగా రైతులు ఎంతో కష్టపడి భారీగా పెట్టుబడులు పెట్టినా ఒక్కసారి కూడా లాభాలు రాకపోవడంతో రైతులు కోహినూర్ దోసపై ఆసక్తి కనబరచడం లేదు.

వైభవంగా బ్రహ్మంగారి గురుపూజ మహోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మే 14: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 19వరకు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ శంకరబాలాజీ తెలిపారు. మే 17 వైశాఖ శుద్ధ దశమి శుక్రవారం స్వామివారు సజీవ సమాధి నిష్టవహించిన పవిత్ర దినం కావడంతో ఆ రోజు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. 18న శనివారం రథోత్సవం ఉంటుందని.. భక్తులందరూ పాల్గొనాలని కోరారు. అలాగే ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగునీరు, వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ ఆరాధన గురుపూజా మహోత్సవాలకు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని అసిస్టెంటు మేనేజరు శంకర బాలాజీ కోరారు. మంగళవారం ఉదయం 5గంటలకు వీర బ్రహ్మేంద్ర స్వామి సుప్రభాతం, నామసంకీర్తనం, 8గంటలకు అభిషేకం, సహస్ర నామార్చన, రాత్రి 7గంటలకు శేష వాహనోత్సవంపై వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవింద మాంబ గుడిఉత్సవం నిర్వహించారు.



శేష వాహనంపై ఊరేగిన వీరబ్రహ్మేంద్రస్వామి

చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీచక్రాన్ని అభిషేకిస్తున్న పూజారులు

వల్లూరు, మే 14 : పుష్పగిరి క్షేత్రంలో జరుగుతున్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు మంగళవారం వైభవోపేతంగా చక్రస్నానం నిర్వహించారు. ఉదయాన్నే వివిధ వైద్యనాథేశ్వర త్రిశూలం, చెన్నకేశవుని శ్రీచక్రం నది ఒడ్డుకు తీసుకువచ్చి వేద మంత్రాల నడుమ అభిషేకాలు, జపాలు నిర్వహించారు. అనంతరం భక్తుల మధ్య స్థానిక అర్చకులు అఖిల్, రాజేశ్‌లు చక్రస్నానం నిర్వహించారు. నదిలో నీరు లేకపోవడంతో భక్తులు కొంత నిరుత్సాహపడ్డారు. శివకేశవులను ఏటి వద్దకు తీసుకువచ్చి పూజలు చేసిన అనంతరం చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం కొండపైన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి సన్నిధిలో పుష్పయాగం చేశారు. ఈ సందర్భం గా వివిధ పూలను తీసుకువచ్చి ఈయాగంలో స్వామివారికి అర్చన చేస్తూ నివేదిస్తూ పుష్పయాగం నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణ చేసి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.

నేడు వెల్లాలలో తలనీలాల వేలం పాట

రాజుపాలెం, మే 14: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెల్లాల సంజీవరాయస్వామి ఆలయానికి సంబంధించి ఈ నెల 15న బుధవారం తలనీలాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ నరసయ్య తెలిపారు. దేవస్థాన ఆలయ అవరణలో జరిగే వేలంలో పాటదారుడు లక్ష ధరావత్తు నగదు రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో హెచ్చు పాటదారునికి భక్తులు సమర్పించిన తలనీలాలు ఏడాదిపాటు పోగు చేసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు.

రేపు ఆలయభూముల కౌలువేలం

పగిడాల గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి దేవాలయానికి సంబంధించిన భూములకు 16న గురువారం ఉదయం 11గంటలకు ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్య సత్రంలో కౌలు వేలం వేస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి రామచంద్ర చార్యులు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులు పదివేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో 62.22 ఎకరాల భూమిని హెచ్చుపాటదారునికి మూడేళ్లపాటు కౌలు భూమిగా సాగు చేసుకోవచ్చన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి



పుష్పరాజు మృతదేహం వద్ద గుమిగూడిన తోటి కూలీలు, పుష్పరాజు (ఫైల్)

చాపాడు, మే 14: మొరాయిపల్లె వాసి, ఉపాధి కూలి మారం పుష్పరాజు (60) గుండెపోటుతో మృతి చెందినట్లు ఏపీఓ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం సోమాపురం వద్ద వంకలో మట్టి పనిచేస్తుండగా ఆయన ఒక్కసారిగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య ఉన్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు పుష్పరాజు మృతదేహనికి నివాళులర్పించారు. పుష్పరాజు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

కారు ఢీ కొనడంతో యువకుడి మృతి

పీలేరు, మే 14: పీలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయి(36) అనే యువకుడు మంగళవారం దుర్మరణం చెందాడు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సా యి ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంలో పీలేరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు సాయిని హుటాహుటి న పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. సాయికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని దుర్మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పీలేరు ఎస్‌ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కడప (క్రైం), మే 14 : కడప నగరం గౌస్‌నగర్‌లో సోమవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. గౌస్‌నగర్‌లోని పోలింగ్ బూత్ వద్ద ఇరువర్గాలు రాత్రి కవ్వింపు చర్యలకు పాల్పడి.. పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురికి గాయాలైనట్లు తెలిపారు. దీంతో టీడీపీ, వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

చెన్నూరు, మే 14: చెన్నూరు బ్రాహ్మణవీధికి చెందిన సిద్ధవటం గోపాల్ (62) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. తమలపాకు తోటల్లో కూలీగా పని చేసే ఆయన రోజూ బతుకుదెరువు కోసం పనులకు వెళ్లేవాడు. ఇటీవల ఎండలు ఎక్కువగా ఉండడంతో మంగళవారం పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన ఆయన అస్వస్థతకు గురై ఒక్కసారిగా నేలపై పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్‌కు గాయాలు



గాయపడ్డ కానిస్టేబుల్ చికిత్స నిమిత్తం తరలిస్తున్న బెటాలియన్ పోలీసులు

సిద్ధవటం, మే 14: రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్ కలాం బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ బెటాలియన్ ఎదురుగా ఉన్న హోటల్ వద్దకు కలాం బాషా ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మారుతీ వ్యాను ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బెటాలియన్ పోలీసులు పోలీసు సంక్షేమ విభాగం అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

పెనుగాలులకు అరటి నేలమట్టం

- 750 ఎకరాలలో పంట ధ్వంసం
- నష్టం రూ.10కోట్లకు పైమాటే...

పులివెందుల రూరల్, మే 14: పెనుగాలులు రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చాయి. పులివెందుల మండలంలో వీచిన పెనుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. డ్రిప్ పరికరాలు కొట్టుకుపోయాయి, అరటి తోటలు, మిరప పంట నేలమట్టం అయ్యా యి. నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, యర్రబల్లె, నల్లగొండువారిపల్లె తదితర గ్రామాలలో రైతులకు భారీ నష్టం వాటిల్లిం ది. దాదాపు 750 ఎకరాలలో అరటి పంట నేలమట్టంకావడంతో దాదాపు రూ.10కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఆదివారం, సోమవారం ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా ఉద్యానశాఖ అధికారులు మంగళవారం ఆయా గ్రామాలకు వెళ్లి పంటలను పరిశీలించారు. ప్రాథమికంగా 750 ఎకరాల దాకా అరటి పంటల ధ్వంసమైనట్లు ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.



యర్రబల్లె పంచాయతీలో కూలిపోయిన అరటితోటలు

నల్లపురెడ్డిపల్లె గ్రామ పరిధిలో కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్



అలాగే ఆయా గ్రామాల పరిధిలో 50విద్యుత్ స్తంభా లు విరిగిపోయాయి. 4 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీనితో ఆయా గ్రామాల పరిధిలో సోమవారం రాత్రి అంధకారంలో ఉన్నట్లు ప్రజలు తెలిపారు. విద్యుత్ సిబ్బంది వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించి విద్యుత్ సరఫరా అందించినట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. విద్యుత్ శాఖకు రూ.4లక్షల దాకా నష్టం వాటిల్లిందని తెలిపారు.

లింగాల మండలంలోని ఇప్పట్ల పంచాయతీ పరిధిలో 100ఎకరాలు, చిన్నకుడాల పంచాయతీ పరిధిలో 50ఎకరాలలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

నష్టపరిహారం పెంచాలి

750 ఎకరాలలో అరటిపంట నేలమట్టం కావడంతో నష్టం తీవ్రంగా ఉందని రైతులు అంటున్నారు. గెలలతో ఉన్న పంటలతో పాటు రెండో దఫా, మూడో దఫా గెలలు వస్తున్న చెట్లు సైతం నేలకొరిగాయి. అయితే ప్రభుత్వం క్రాప్ డ్యామేజ్ ఇన్సూరెన్స్ కింద ఎకరాకు రూ.10వేలు చెల్లిస్తుందని రైతులు తెలిపారు. ఎకరా పంట సాగుకు దాదాపు రూ.2 నుంచి రూ.3లక్షలకు పైబడి ఖర్చు వస్తుందని.. ఇన్సూరెన్స్ ఇంత తక్కువ ఇస్తే ఎక్కడికి సరిపోదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చచ్చిపోయే ముందు నీళ్లు చల్లి లేపినట్లు ఉంటుంది ఈ సాయం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచించి నష్టంపరిహారం పెంచాలని రైతులు కోరుతున్నారు.

రైల్వేకోడూరును కానుకగా ఇస్తాం

- టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి
- కాకిలెక్కల్లో నేతలు
- విజయంపై ఎవరి ధీమా వారిది..

రైల్వేకోడూరు, మే 14: ఎన్నికలు ముగిశాయి. మెజార్టీపైనే నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. మంగళవారం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఐదు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఏయే పోలింగ్ కేంద్రం నుంచి ఎంత మెజార్టీ వస్తుందో బేరీజు వేసుకున్నారు. జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం ఖాయమని చెబుతున్నారు. పోలింగ్ తీరును బట్టి జనసేన కు అత్యంత మెజార్టీ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని నాయకులు చెబుతున్నారు. వైసీపీ కంచుకోటల్లో కూడా జనసేన, బీజేపీకి ఓట్ల వర్షం కురిసిందని చెబుతున్నారు. పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాలు ఎక్కువగా వైసీపీకి అనుకూలంగా ఉండేవి. ఈ ఎన్నికల్లో కూటమికి అనుకూలంగా మారినట్లు చెబుతున్నారు. ప్రతి బూత్‌లో పడిన ఓటింగ్ శాతం చూస్తే వైసీపీ కోటలు బద్దలు అయినట్లు కనిపిస్తున్నాయి. ఐదు మండలాల్లో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చాలా కష్టపడ్డారని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. రైల్వేకోడూరులో విజయం సాధిస్తామని ఈ విజయాన్ని చంద్రబాబు, పవనకళ్యాణ్‌లకు కానుకగా ఇస్తామని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.




ముక్కావారిపల్లె లో ప్రధాన నేతలతో చర్చిస్తున్న ముక్కా రూపానందరెడ్డి, ముక్కా ఇంట్లో సమావేశమైన నాయకులు కార్యకర్తలు

మెజారిటీపై ఇరు పార్టీల్లో ధీమా

ఒంటిమిట్ట: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో మండలంలో ఇరుపార్టీల నాయకులు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ, టీడీపీ నాయకులు తమ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయో కాకి లెక్కలు వేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 32 బూతుల్లో 24,577 ఓట్లకుగానూ 19,544 ఓట్లు పోలవడంతో 79.56 శాతంగా నమోదైంది. వైసీపీకి నాలుగు నుంచి 5 వేల మెజారిటీ వస్తుందని నాయకులు. ధీమా వ్యక్తం చేస్తుండగా టీడీపీ తమకు కనీసం 1000 ఓట్ల మెజారిటీ తగ్గదని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నుంచి ఐదు వేల మధ్య మెజారిటీపై పెద్దఎత్తున పందెం రాయుళ్ల పందెం కాసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై మండల వ్యాప్తంగా రాజకీయ నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది.

క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా చర్చ

పెనగలూరు, మే 14 : సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కనీవిని ఎరుగని స్థాయిలో ఓటింగ్ శాతం నమోదు కావడంతో, ఓటును సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై అవగాహన పెరిగిందని ప్రజలు అనుకుంటున్నారు. ఇదే సమయంలోనే ఓటరు తాను అభిమానించే వారికే ఓటు వేసిన విధానం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. దీనికితోడు భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు చెప్పుకుంటున్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అభిమానులైన పలువురు గాజుగ్లాసు గుర్తుకే ఓటేసినా, పార్లమెంటుకు మాత్రం వైసీపీకి ఓటు వేసినట్లు చెబుతున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిలోనే ఎంపీ మిథున్‌రెడ్డికి రెండు సార్లు అవకాశమిచ్చామని, అయితే ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించే లక్ష్యంతో పలువురు వైసీపీ అభిమానుల ఆయనకు ఓటు వేసినట్లు తెలుస్తోంది. రెడ్డి సామాజిక వర్గంలోనే క్రాస్ ఓటింగ్ జరగగా మిగతా సామాజిక వర్గాల్లో చాలా వరకు నియోజకవర్గంలోని అగ్ర నాయకుల అభ్యర్థిత్వం నచ్చకపోయినా, పనితీరు బాగా లేకపోయినా, తాము అభిమానించే పవన్‌కళ్యాణ్, చంద్ర బాబునాయుడు గెలిచి తీరాలని జనసేన, బీజేపీకి ఓట్లు వేసినట్లు అనుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో పెనగలూరు మండలంలో 78శాతం ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. ఇదిఇలా ఉండగా సాయంత్రం 6 గంటల వరకు ఓట్లు వేసేందుకు సమయం ఉన్నా పెనగలూరులో రెండు, సిద్దవరంలో రెండు, కాకర్లవారిపల్లెలోని ఒక పోలింగ్ కేంద్రంలో రాత్రి 8గంటల వరకు ఓటర్లు క్యూలో నిలబడి ఓట్లు వేయడం గమనార్హం. రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా ఎవరు గెలిచినా స్వల్ప మెజారిటీతో బయటపడవచ్చునని అనుకుంటున్నారు

నేతలు రిలాక్స్..



యువనేత ముక్కా సాయివికాస్‌తో మాట్లాడుతున్న అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, మే 14: పోలింగ్ పర్వం పూర్తవడంతో మంగళవారం నేతలు, కార్యకర్తలు రిలాక్స్ అయ్యారు. వారి వాహనాలు, డ్రైవర్లు కూడా సేద తీరుతున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి రైల్వేకోడూరులోనే ఉండి ఇంటి ముఖం చూడకుండా ప్రచారం నిమగ్నమయ్యారు. అదే విధంగా బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి పులపత్తూరు రామసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకులు తోట శ్రీనివాసులు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు దాసర్రాజు జయప్రకాష్ నారాయణవర్మ, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ ఇన్‌చార్జులు జోగినేని మణి, పగడాల వెంకటేష్ తదితరులు రిలాక్స్ అయ్యారు.

నల్లారిని కలిసిన నాయకులు

వాల్మీకిపురం, మే 14: మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం కలికిరి బీజేపీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసి పోలింగ్ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నాయకులతో మాట్లాడుతూ ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని రాష్ట్రంలో ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారన్నారని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని తెలియజేసినట్లు వివరించారు.టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారన్నారు. లెక్క సరిచేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎవ్వరూ భయపడాల్సిన పని లేదని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, పీలేరు మైనార్టీ పార్టీ అధ్యక్షులు సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

చిట్వేలి, మే14 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఏజెంట్లు దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నియోజకవర్గ పరిశీలకులు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధన్‌రెడ్డి, జనసేన పార్టీ రాయలసీమ జోనల్ కన్వీనర్ రాందాసు చౌదరి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, చిత్తూరు జిల్లా కార్యదర్శి జంగాల శివరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చిట్వేలి పార్టీ కార్యాలయంలో మండల నాయకుడు మాదాసు నరసింహతో కలిసి విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ . జనసేన, బీజేపీ ఏజెంటు, కార్యకర్తలపైన దాడులకు తెగబడటం తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ గూండాలు దాడుల్లో గాయపడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నారన్నారు. పుల్లంపేట మండలంలో జనసేన ఏజెంటు రాజారెడ్డి, సుబ్రమణ్యంపై దాడి చేయడం అన్యాయమన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రాజారెడ్డిని వెంటనే విడుదల చేయాలని, అలాగే నాగవరం బీజేపీ ఏజెంటు నాగార్జునరెడ్డిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్‌డీఏకు వస్తున్న ఆదరణ చూసి దాడులకు పాల్పడటం అన్యాయమన్నారు. ఇకనైనా అధికారులు గుర్తించి అక్రమాలకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వ అధికారంలోకి రాబోతుందన్నారు. దాడి చేసిన వారు బయట.. గాయాలైన వారు లోపల ఉన్నారని, ఇది ఎక్కడి ప్రజాస్వామ్యమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్ర మంలో సుభాష్ చంద్రబోస్, ప్రసాద్, పెంచలయ్య, మాదాసు శివ, రియాజ్, పెంచలయ్య, చక్రి, తేజ, సాయి, సుబ్బు, శివ, కృష్ణ, సతీష్ రెడ్డి, పొన్నరెడ్డి, పవన్‌రెడ్డి, భాను ప్రకాష్, శివశంకర్, మణి, బాలు, నాగరాజు, రాజా మహేష్, నవీన్ కుమార్, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేతలు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. కార్యకర్తలతో సుగవాసి

రాజంపేట, మే14 : నెలరోజుల పైబడి క్షణం తీరిక లేకుండా గడిపిన రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మంగళవారం ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా కనిపించారు. రాత్రి పొద్దుపోయేంత వరకు ఎన్నికల ప్రక్రియలో బిజీబిజీగా గడిపిన ఆయనకు మంగళవారం విశ్రాంతి దొరికింది. ఈ సందర్భంగా రాజంపేటలోని తెలుగు దేశం కార్యాలయానికి మంగళవారం ఉదయం వచ్చి నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ నాయకులు, కార్య కర్తలతో మాట్లాడారు. ప్రధా నంగా ఆయా గ్రామాల పరిధిలో ఓటింగ్ సరళిపై చర్చించారు. ఆరు మండలాల్లో 288 పోలింగ్ బూత్‌లలో పోలైన ఓట్ల వివరా లను క్షుణ్ణంగా పరిశీలించారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు, రాజంపేట నుంచి తాను భారీ మెజారిటీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, సీనియర్ నేత మాలేపాటి రామకృష్ణంనాయుడు, మండల టీ డీపీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, లీగల్ సెల్ పార్ల మెంటు అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, రాజంపేట పట్టణ నాయకులు గంప శివ, రాజంపేట పార్లమెంటు కార్యదర్శి మంద పల్లెకు చెందిన కొండా శ్రీనివాసులు, బగ్గిడిపల్లె మాజీ సర్పంచ్ అరుణా చలం, కూచివారిపల్లె నాయకులు మల్లికార్జుననాయుడు, అగ్రహారం నాయ కులు సుధాకర్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు గుగ్గిళ్ల చంద్రమౌళి, శ్రీవిద్యానికేతన్ కరస్పాండెంటు అబ్బూరి ప్రభాకర్‌నాయుడు, రాష్ట్ర రజక సంఘం నాయకులు రామ్‌నగర్ నరసింహ, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, ఊటు కూరు నాయకులు చెంగల్‌రాయులు, ఒంటిమిట్ట టీడీపీ నాయకులు బొబ్బిలి రాయుడు, మైనారిటీ నాయకులు మౌలా తదితరులు పెద్దఎత్తున సుగవాసితో భేటీ అయ్యారు.



సుగవాసితో భేటీ అయిన అగ్రహారం టీడీపీ నాయకులు

అధిక చార్జీలు అరికట్టడంలో అధికారులు విఫలం

లక్కిరెడ్డిపల్లె మే 14: దూర ప్రాంతాల నుంచి ఓటు వేయడం కోసం వచ్చి వెళుతున్న ప్రయాణికులపై ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీని అరికట్టడంలో రవాణశాఖ అధికారులు విఫలమయ్యారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న ఆరోపించారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రైవేటు ట్రావెల్స్ వారు అధిక చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నా రవాణశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆర్‌టీసీ బస్సు ఛార్జీలకు అనుగుణంగా టికెట్ ధరలు కొసాగించాలని ఆయన అధికారులను కోరారు. ప్రైవేటు ట్రావెల్స్ వారు వేలాది రూపాయలు వసూలు చేసి ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారని, బెంగుళూరు, హైదరాబాదు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లేందు సామాన్యుడు చాల ఇబ్బందులు పడుతున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఈశ్వరయ్య, స్వరూప్, తేజ, చంద్రశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

రాజంపేటలో ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు తథ్యం

- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్

సుండుపల్లె, మే14: బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యంల గెలుపు తథ్యమని రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. మంగళవారం సుండుపల్లె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గ పార్లమెంటు ప్రజలు ఎన్డీఏ అధికారాన్ని కోరుకున్నారన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకంతో ప్రజలు ఓటు వేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుబ్బరాజు, మాజీ జోనల్ ఇన్‌చార్జి వెంకట్రామరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచరాయుడు, మండల ప్రధాన కార్యదర్శి నాగమునెయ్య, కిసాన్ మోర్చ అధ్యక్షులు సుబ్బరాజు, సత్యంనాయుడు, గోపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో వృద్ధులు, దివ్యాంగులకు తిప్పలు

పెనగలూరు, మే14 : పోలింగ్ కేంద్రా లకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు ఎన్నికల కమిషన్ అవ కాశం కల్పించినా ప్రభుత్వ యంత్రాం గం అందుకు తగినట్లు ఏర్పాట్లు చే యకపోవడం, ప్రచారం చేయకపోవడంతో సోమవారం జరిగిన అసెం బ్లీ, పార్లమెంటు ఎన్నికలలో ఆయా వర్గాల వారు పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రా ల వద్ద తాగునీరు ఏర్పాటు చేయక పోవడం, దివ్యాంగులను పోలింగ్ బూతు వద్దకు తీసుకెళ్లే సదుపాయం లేకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 41పోలింగ్ కేంద్రాలున్నా ఎక్కడా చక్రాల కుర్చీలు ఏర్పాటు చేసి దాఖలాలు కనిపించలేదు. ప్రభుత్వం సరఫరా చేసిన చక్రాల కుర్చీలన్నింటినీ ప్యాకింగ్ సైతం విప్పకుండా.. మండల పరిషత్ కార్యాలయంలో భద్రంగా దాచిపెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం ప్రత్యక్షంగా కనిపించింది. ఈ విషయంపైన పెనగలూరు తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణిని ప్రశ్నించగా చక్రాల కుర్చీలను పోలింగ్ కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలని వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి తెలిపామని, వారు ఆ పనిచేయలేదని తెలిపారు. ఇదిఇలా ఉండగా ఈవీఎంల వద్ద ఓటు వేసే విధానం తెలియక ఒక్కో ఓటరు పది నిమిషాల సేపు అక్కడే నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరువాత ఎవరో ఒకరు వెళ్లి నీకు నచ్చిన ఏదో ఒక మీటపై నొక్కాలని చెప్పాల్సి వచ్చింది. ఈ విషయంలో కూడా ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవగాహన కల్పించేందుకు నమూనా ఈవీఎంలను భారీగా పంపించినప్పటికీ కంటి తుడుపుగా కొన్ని గ్రామాల్లో మాత్రమే అవగాహన కల్పించి చేతులు దులుపుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలు జరిగే నాటికి ఒకటిన్నర నెల సమయం ఉన్నా ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు.



పోలింగ్ కేంద్రంలోకి వెళ్లలేక మెట్లపైనే కూర్చుండిపోయిన దివ్యాంగులు

చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవం

చిన్నమండెం, మే14: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో మంగళవారం తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి సాయంత్రం నాలుగు గంటల నుంచ జ్యోతులను తయారు చేశారు. రాత్రి 9 గంటల నుంచి సింహ వాహనంపై అమ్మవారి ఊరేగింపు, అనంతరం అగ్నిగుండం ప్రవేశం ఉంటుంద ని తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తొగటవీర క్షత్రియ సంఘం కుటుంబ సభ్యులు, భక్తాదులు తరలివచ్చారు.



చౌడేశ్వరి అమ్మవారి మూలవిరాట్

జిల్లా కేంద్రానికి తరలిన ఈవీఎంలు

రాజంపేట, మే 14 : రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం లను మంగళవారం రాయచోటిలోని ఇంజనీరింగ్ కళాశాల లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. సోమవారం రాత్రి నుండి మంగళవారం తెల్ల వారుజాము వరకు రెండు కంటైనర్లలో రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించారు.

రైల్వేకోడూరు: నియోజకవర్గ కేంద్రం అనంతరాజుపేట ఉద్యాన యూనివర్సిటీలో ఈవీఎం స్ట్రాంగ్ రూంను ఏర్పాటు చేశారు. అక్కడే పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు ఇచ్చారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో పోలింగ్ కొన్ని కేంద్రాల్లో ఆలస్యంగా ముగియడం రాత్రి కావడంతో ఈవీఎంలను ఉద్యాన యూనివర్సిటీకి చేర్చారు. రాత్రి కావడంతో మంగళవారం ఉదయం ఈవీఎంలను ప్రత్యేక భద్రతతో రాయచోటికి తరలించారు.

దాడిలో గాయపడిన బీజేపీ కార్యకర్తకు పరామర్శ

రైల్వేకోడూరు, మే 14: నియోజకవర్గంలోని నాగవరం పో లింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్‌గా ఉన్న నాగార్జునరెడ్డిపై సోమవారం వైసీపీ మూకలు దాడులు చేసిన విషయం తెలిసిందే. రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్న ఆయనను టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. దా డులను అరికట్టే బాధ్యతను పోలీసులు తీసుకోవాల న్నారు.

బీజేపీ పోలింగ్ ఏజెంట్‌పై వైసీపీ దాడి

గుర్రంకొండ, మే 14:భారతీయ జనతా పార్టీ పోలింగ్ ఏజెంట్‌పై సోమవారం రాత్రి తరిగొండలో వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి కథనం మేరకు టి.రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు చిన్నరెడ్డెప్పరెడ్డి తరిగొండ పోలింగ్ బూత్‌లో బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్నాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చాడు. అప్పటికే తరిగొండ బస్టాండులో ఉన్న వైసీపీ నాయకులు అతని తలపై ఇనుపరాడ్‌తో దాడి చేశారు. అక్కడికి వచ్చిన అతడి అన్న వేణుగోపాల్‌రెడ్డిపై కూడా దాడి చేశారు. క్షతగాత్రుడిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి గంగమ్మ జాతర ప్రారంభం

రైల్వేకోడూరు, మే 14: పట్టణంలో గంగమ్మ జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దీంతో ఆలయం వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. ఊరంతా విద్యుత్ దీపాలంకరణ చేశారు. విజయవాడ నుంచి తప్పెట్లు, గంగమ్మ వేషాలు, డీజే తదితరాలు ఏ ర్పాటు చేస్తున్నారు గురువారం గంగమ్మను ఊరేగిస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఉమ్మడి కడప జిల్లానే కాకుండా చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన భక్తులు తరలివస్తారు. 17న శుక్రవారం ఉద యం అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది దాతలు గంగమ్మకు బంగారు కిరీటం చేయిం చారు. జాతర ముందు రోజు భద్రపరచిన నగలన్నీ తీసి అమ్మవారికి అలంకరిస్తారు.



జాతర సందర్భంగా ఏర్పాటుచేసి చలువ పందిళ్లు

వైసీపీ బరితెగింపు

మహిళా వర్శిటీ ప్రాంగణంలో పులివర్తి నానీపై హత్యాయత్నం

దాడులు, ప్రతిదాడులు... వాహనాల ధ్వంసం.. బైక్ దహనం.. గాల్లోకి కాల్పులు... లాఠీఛార్జి... పలువురికి గాయాలు


నానీపై హత్యాయత్నం సమాచారంతో మహిళా వర్సిటీకి వందలాదిగా చేరుకున్న టీడీపీ శ్రేణులు.. గాయపడిన నానీకి ఉపచారాలు


దాడి చేస్తున్న వైసీపీ కార్యకర్త

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడితో మంగళవారం తిరుపతి పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణం రణరంగంగా మారింది. దాడులు, ప్రతిదాడులు, వాహనాల ధ్వంసం, బైక్ దగ్ధం, గాల్లోకి కాల్పులు, లాఠీఛార్జీలు వంటి ఘటనలతో ప్రశాంతతకు మారుపేరైన మహిళా వర్శిటీ ప్రాంతం అట్టుడికిపోయింది. వందలాదిమంది వైసీపీ, టీడీపీ మద్దతుదార్ల దాడులు, ప్రతిదాడులతో గంటల పాటు వర్శిటీ ప్రాంగణం, పరిసరాల్లో ఉద్రిక్తతలు రాజ్యమేలాయి.

మధ్యాహ్నం 3.22 గంటలకు

మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూముల నుంచీ వెనుదిరిగి వస్తున్న పులివర్తి నానీ వాహనాలపై వైసీపీ వర్గీయులు బీరు బాటిళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులతో దాడి చేశారు. వాహనాలు ధ్వంసం చేశారు. నానీని గాయపరిచారు. గన్‌మ్యాన్ గాల్లోకి కాల్పులు జరిపినా వెనక్కు తగ్గకుండా దాడులకు తెగబడడంతో గన్‌మ్యాన్ ధరణి కూడా తీవ్రంగా గాయపడ్డారు.

3.35 గంటలకు: దాడి నుంచీ తేరుకున్న నానీ అనుచరులు ఆయన్ను తీసుకుని వర్శిటీ మెయిన్ గేటు దాటి వెలుపలికి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. అరగంట పాటు ధర్నా నిర్వహించి నానీని స్విమ్స్‌కు తరలించారు.

సాయంత్రం 4.10 గంటలకు: పెద్ద సంఖ్యలో మహిళా వర్శిటీలోకి చేరుకున్న టీడీపీ శ్రేణులు రాళ్ళు, ఇనుప రాడ్లతో ప్రతిదాడికి దిగారు. వైసీపీ వర్గీయులకు చెందిన కారును ధ్వంసం చేశారు. ఆవరణలో ఆందోళనకు దిగారు.

4.30గంటలకు: అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంలో లోపలికి రాగా వాహనాన్ని చుట్టుముట్టి పోలీసు వైఫల్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఐ వాహనం దిగి దూరంగా వెళ్ళగా వాహనాన్ని ధ్వంసం చేశారు.

5గంటలకు: చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా భారీ సంఖ్యలో టీడీపీ మద్దతుదారులు వర్శిటీలోకి దూసుకొచ్చారు. పోలీసు తీరును నిరసిస్తూ వర్శిటీ ఎదుట ఆందోళనకు దిగారు.

5.15గంటలకు: ఇద్దరు ఏఎస్పీలు, డీఎస్పీలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. టీడీపీ వర్గీయుల ఆందోళన మరింత తీవ్రతరమైంది.

5.20గంటలకు: బీఎస్ఎఫ్ పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసులు లాఠీఛార్జి జరిపి చెదరగొట్టేందుకు యత్నించారు.

5.30 గంటలకు: వైసీపీ స్టిక్కర్ వున్న మొబైల్ చేతిలో పట్టుకుని బైక్‌పై వచ్చిన యువకుడిని ఆందోళనకారులు చితకబాది బైక్‌ను తగులబెట్టారు.

5.45 గంటలకు: మహిళా వర్శిటీ వద్దకు చేరుకున్న టియర్ గ్యాస్ వాహనాలు, కేంద్ర సాయుధ బలగాలు. వచ్చీ రాగానే లాఠీఛార్జి చేసి ఆందోళన కొనసాగిస్తున్న టీడీపీ వర్గీయులను చెదరగొట్టి తరిమివేశారు. లాఠీఛార్జిలో పదిమంది గాయపడ్డారు. అందులో ఐదుగురు మీడియా ప్రతినిధులున్నారు.

6గంటలకు: ఘటనా స్థలానికి ఎస్పీ రాక. టీడీపీ అభ్యర్థి, అతడి గన్ మ్యాన్ క్షేమంగా వున్నారని, స్ట్రాంగ్ రూమ్ సైతం భద్రంగా వుందని మీడియాకు స్పష్టం చేశారు. అభ్యర్థిపై జరిగిన దాడిలో పాల్గొన్న నిందితులను గుర్తించామని, గంటలోగా అరెస్టు చేస్తామని వెల్లడించారు.




సుత్తితో వీర విహారం.. కారు దిగి వెళుతున్న నాని.. లాఠీఛార్జి

భీతావహంగా వర్సిటీ ప్రాంగణం

పగిలిన బీరు బాటిళ్ళు, రాళ్ళు, విరిగిపోయిన కర్రలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడివున్నాయి. నానీ వాహనాలు, వైసీపీ వర్గీయుల వాహనం, పోలీసు వాహనం ధ్వంసమయ్యాయి. నానీ వాహనాల్లో ప్రత్యర్థులు దాడి సందర్భంగా వదిలిపెట్టిన రాళ్ళు, ఉనుప సుత్తి వంటివి పడున్నాయి. వీటితో వర్సిటీ ఆవరణ భీతావహంగా మారింది.

పోలీసు వైఫల్యంతోనే టీడీపీ అభ్యర్థిపై దాడి

సోమవారం పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో తలెత్తిన ఘటనలతో టీడీపీ, వైసీపీ వర్గాల నడుమ ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. వీటి తీవ్రతను అంచనా వేయడంలో పోలీసులు దారుణంగా తప్పటడుగు వేశారు. దాడులు, ప్రతిదాడులు జరిగే అవకాశముందన్న కనీస ఆలోచన గానీ, వాటిని అడ్డుకునే కనీస ప్రయత్నం గానీ చేయలేదు. రెండు పార్టీల సామాజిక మాధ్యమాల మీద కన్నేసేవారు. వారి కదలికల సమాచారం షాడో పార్టీల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుని ఇలాంటి ఘటనలను నిలువరించే వీలుండేది. ఈ విషయంలో పోలీసులు దారుణంగా విఫలమైనట్టు కనిపిస్తోంది. ఇక, మహిళా వర్శిటీ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద కాపలా వున్న పోలీసులు ఘటనా స్థలానికి రావడంతో నానీపై దాడికి పాల్పడిన వైసీపీ వర్గీయులు పరారయ్యారు. ఒకవేళ వాళ్ల సకాలంలో రాకుంటే నానీ, అతడి అనుచరుల పరిస్థితి ఏమై వుండేదన్న ప్రశ్న భయం గొలుపుతోంది. వైసీపీ వర్గీయులు రాళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులు వంటివి వెంట తెచ్చుకుని దాడికి దిగిన తీరు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

వేగంగా స్పందించని పోలీసులు

నానీపై దాడి జర్గ్గా ఆయన సతీమణి సుధారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అటు పోలీసులకు, ఇటు టీడీపీ శ్రేణులకు వెంటనే రావాలని పిలుపిచ్చారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడో వున్న టీడీపీ కార్యకర్తలు వందలమంది అరగంటలో మహిళా వర్శిటీకి చేరుకోగా పోలీసు బలగాలు మాత్రం సకాలంలో రాలేదు. దానివల్లే ఐదారు వందలమంది టీడీపీ మద్దతుదారులు వర్శిటీ ఆవరణలోకి ప్రవేశించి ప్రతి దాడులకు పాల్పడ్డారు. చివరికి పోలీసు వాహనం కూడా వారి దాడిలో ధ్వంసమైంది. దీనికి కూడా పోలీసు వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత డొల్లతనం బట్టబయలు

మహిళా వర్శిటీ ఆవరణలోని ఇంజనీరింగ్ విభాగం గదుల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ మూడంచెల భద్రత కల్పించామని కలెక్టర్, ఎస్పీ స్వయంగా వెల్లడించారు. తొలి అంచెలో అంటే గదుల వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలు, రెండవ అంచెలో అంటే భవనం వెలుపల సాయుధ బలగాలు, మూడవ అంచెలో సాధారణ పోలీసులు, హోమ్‌గార్డులు కాపలా వుంటారని చెప్పారు. ఎన్నికల అధికారులను, అభ్యర్థులను, వారి జనరల్ ఏజెంట్లను అది కూడా వారి ఐడీలను తనిఖీ చేశాకే లోనికి అనుమతించాల్సి వుండగా 150మందికి పైగా వైసీపీ కార్యకర్తలు వాహనాల్లో వర్శిటీ ఆవరణలోకి ఎలా రాగలిగారన్నది ప్రశ్న. అంతమంది యధేచ్ఛగా మారణాయుధాలతో లోనికి వచ్చి టీడీపీ అభ్యర్థి వాహనాలను ధ్వంసం చేసి అభ్యర్థిపైన, గన్‌మ్యాన్‌పైనా దాడి చేయడం కలకలం సృష్టించింది.ఇదే సాధ్యమైనప్పుడు స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంలను యంత్రాంగం ఎంతవరకూ కాపాడగలదన్న ప్రశ్న తలెత్తుతోంది.

ప్రధాన నిందితులు గణపతి, భాను?

పులివర్తి నానీ, ఆయన గన్‌మెన్ ధరణిపై దాడికి సంబంధించి సీసీ ఫుటేజీ, అక్కడున్న కారు వివరాలను పోలీసులు సేకరించినట్లు తెలిసింది.రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డితో పాటు దాదాపు 50మంది దాకా దాడి ఘటనలో పాల్గొన్నట్లు సీఐ మురళీకృష్ణ గుర్తించారు. ఘటనా స్థలంలో వైసీపీ కండువాలను, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నాని, ఆయన గన్‌మెన్ క్షేమంగా ఉన్నారని, దాడికి పాల్పడిన వారిని త్వరలో పట్టుకుంటామని తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చెప్పారు.

నాగమవాండ్లపల్లెలో గజదాడులు


భజనబండ వద్ద ఏనుగులు నాశనం చేసిన వరి పంట

ఐరాల, మే 14: ఐరాల మండలం నాగమవాండ్లపల్లెలో ఏనుగుల గుంపు సోమవారం రాత్రి పది ఎకరాలలో పంటలను నాశనం చేశాయి. నాగమవాండ్లపల్లె సమీపం భజనబండ వద్ద ఏనుగులు పంట పొలాలపై దాడికి దిగాయి. వరి పంటకు నీళ్ల వదలడానికి వెళ్లిన రైతులు ఏనుగులను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా సుమారు పది మంది సంఘటనా స్థలానికి విచ్చేసి రేకు డబ్బాలతో శబ్ధం చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు ఎన్నికల విధులలో ఉన్నట్లు తెలియజేయడంతో రైతులు ఏమి చేయలేక పోయారు. ఏనుగుల దాడిలో రంగమ్మచెరువుకు చెందిన రఫీ,ఖయ్యూంల రెండెకరాలు, నాగమవాండ్లపల్లెకు చెందిన కె.దేవరాజులు, ఎస్.దేవరాజులు, ఎన్.రాఘవేంద్ర,బి.రమేష్, డి.బాబు, వెదర్లపల్లెకు చెందిన సుధాకర్‌కు సంబంధించిన వరి పంటను ఏనుగుల గుంపు తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల గుంపు సమీపంలోని అటవీప్రాంతంలో తిష్ఠ వేసినట్లు సమాచారం.

1290 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

చిత్తూరు (సెంట్రల్), మే 14: జిల్లాలో ఈనెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు జిల్లాలోని 1290 ఎకరాల్లో 926 మంది రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారులు లెక్కలు కట్టారు. పంట నష్టం రూ.3.79 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా 1060 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. పంట నష్టం అంచనా రూ.1.93 కోట్లుగా లెక్కలు కట్టారు. అరటి 90 ఎకరాలు, పప్పాయి 22.5 ఎకరాలు, టమోటా 70 ఎకరాలు, వేరుశెనగ 5 ఎకరాలు కాగా కొబ్బరి ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించినట్లు ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కాపురానికి రాలేదని భార్యపై హత్యాయత్నం

● తల, చేతులపై కత్తితో నరికిన భర్త

● బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


చికిత్స పొందుతున్న స్వాతి

యాదమరి, మే 14: కాపురానికి రాలేదనే కోపంతో భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గాయపడిన తల్లిని చూసిన కుమార్తె 108కు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి చేర్పించారు. ఈ ఘటన మంగళవారం యాదమరి మండలంలో చోటుచేసుకుంది. సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గుడిపాల మండలం పేయనపల్లెకు చెందిన ఉమాపతి(34) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే మండలం చీలాపల్లెకు చెందిన వరుసకు మేనత్త కుమార్తె అయిన స్వాతి(25)ని పదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరి కుటుంబం ప్రస్తుతం చిత్తూరు నగరంలోని జానకారపల్లెలో నివాసముంటోంది. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో పాటు భార్యపై అతడికి అనుమానం పెరిగింది. ఈ కారణాలతో కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఉమాపతి కొద్దిరోజులుగా యాదమరి మండలం ముత్తరపల్లె వద్ద పనులు చేసుకుంటూ ఎక్స్‌కవేటర్ షెడ్డు వద్దే ఉన్నాడు. మంగళవారం ఇంటి నుంచి స్వాతి తన కుమార్తె సదాశ్రీతో కలిసి భర్త పనిచేస్తున్న షెడ్డువద్దకు వెళ్లింది. అక్కడ నుంచి పక్కనే ఉన్న బస్టాప్ వద్దకు చేరుకున్నారు. బస్టాప్ వద్ద ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. మాటమాట పెరిగి తీవ్రస్థాయికి చేరడంతో చికెన్ నరికే కత్తితో భార్య తలపై, చెయ్యిపై విచక్షణారహితంగా నరికాడు. దాంతో కళ్లెదుటే తల్లి అపస్మారక స్థితిలో పడిపోవడాన్ని చూసిన కుమార్తె సదాశ్రీ రోదిస్తూ వెంటనే తన ఫోన్ నుంచి 108కు సమాచారం ఇచ్చింది. వెంటనే వచ్చిన 108వాహనం బాధితురాలిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. స్వాతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉమాపతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

బోయకొండ ఆలయ కార్యాలయంలో అగ్నిప్రమాదం

● విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణం


అగ్నికి ఆహుతైన బోయకొండ కార్యాలయం

చౌడేపల్లె, మే14: బోయకొండ ఆలయ కార్యాలయంలో మంగళవారం వేకువజామున అగ్నిప్రమాదం జరిగింది. కొండపై ఆలయ సమీపంలో పిడుగులు పడ్డాయి. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి కార్యాలయంలో మంటలు చెలరేగాయి. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఫర్నిచర్, ఏసీలు, కంప్యూటర్, ప్రింటర్, ఫ్యాన్లు, పీవోపీలు, డోర్‌లు, అద్దాలు, సీసీ కెమరాలతో పాటు పలు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

అర్ధరాత్రి తోటలకు, డ్రిప్ సిస్టమ్‌కు నిప్పు

రూ.2.7 లక్షల ఆస్తి నష్టం ● వైసీపీ పనేనని బాధితుల ఆరోపణ



బూరుగుమాకులపల్లెలో మామిడిచెట్లకు పెట్టిన నిప్పు - బల్లలో ధ్వంసమైన డ్రిప్‌సిస్టమ్

రామకుప్పం, మే 14: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ బూరుగుమాకులపల్లె, పంచాయతీకేంద్రమైన బల్లలో సోమవారం అర్ధరాత్రి ప్రత్యర్థుల తోటలకు, వ్యవసాయ పరికరాలకు నిప్పు పెట్టారు. దీనివల్ల రూ.2.70 లక్షల ఆస్తి నష్టం కలిగినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. బూరుగుమాకులపల్లెలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉన్న రామేగౌడ కొన్ని నెలల కిందట వైసీపీలో చేరారు. వైసీపీ శ్రేణుల మధ్య ఇమడలేక ఆయన ఇటీవల తిరిగి టీడీపీలోకి వచ్చేశారు. ఆ పార్టీ తరపున ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి అతడి మామిడి చెట్లకు, టమోటా తోటలో ఏర్పాటు చేసే ఆసరా కర్రలకు, డ్రిప్‌పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మామిడి చెట్లు కాలిపోగా.. పక్కనే ఉన్న అరటి తోటలోని సుమారు 50చెట్లు వాడిపోయాయి. ఆసరా కర్రలు, రెండు కట్టల డ్రిప్‌పైపులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.70 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. తాను టీడీపీలో చేరానన్న అక్కసుతోనే వైసీపీకి చెందినవారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని బాధిత రైతు వాపోయారు.

● అలాగే, బల్ల గ్రామంలో మునస్వామి కుమారులు వెంకటాచలం, చంద్రశేఖర్, శ్రీకాంత్ తమ గ్రామంలోని 95వ బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్లుగా ఉన్నారు. పోలింగ్ సందర్భంగా వీరు వైసీపీ వారు ఎటువంటి అక్రమాలు పాల్పకుండా నిక్కచ్చిగా వ్యవహరించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వెంకటాచలం పొలం వద్ద గల పూరిగుడిసె, బోరు మోటారు స్టార్టరు ప్యానెల్‌కు దుండగులు నిప్పు పెట్టారు. పూరిగుడిసె, స్టార్టరు ప్యానెల్, అందులోని పరికరాలు, 300 మీటర్ల కేబుల్‌వైర్, డ్రిప్‌పరికరాలు కాలిపోయాయి. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. తాను, తన సోదరులు టీడీపీ ఏజెంట్లుగా ఉండటాన్ని భరించలేక వైసీపీ శ్రేణులే కక్షతో ఈ చర్యకు పాల్పడి ఉంటారని వెంకటాచలం ఆరోపిస్తున్నారు.

పోలింగ్ కేంద్రంలో వైసీపీకి వ్యతిరేకంగా కూర్చుంటావా?

● పుంగనూరులో బీజేపీ ఏజెంట్‌కు రౌడీషీటరు బెదిరింపు

పుంగనూరు, మే 14: 'పుంగనూరులో వైసీపీకి వ్యతిరేకంగా పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా కూర్చుంటావా? నీకెంత ధైర్యం? నువ్వు ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చి లేదా నీ ఇంటికి వచ్చి కొట్టి నరకం చూపిస్తా' అంటూ పుంగనూరులో బీజేపీ ఏజెంట్ వివేకానందను వైసీపీకి చెందిన రౌడీషీటరు చెంగాలపురం సూరి ఫోన్‌లో హెచ్చరించాడు. ఈ మేరకు మంగళవారం బాధితుడు వివేకానంద ఫోన్ కాల్ రికార్డింగ్‌తో ఎస్పీ, పుంగనూరు పోలీసులు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన ప్రకారంకథనం మేరకు వివరాలు.. పుంగనూరు పట్టణం చెంగాలాపురంలోని తోట వివేకానంద సోమవారం రహ్మత్‌నగర్ పోలింగ్ స్టేషన్ 49లో బీజేపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున ఏజెంట్‌గా ఉన్నారు. ఆ రాత్రి వివేకానందకు వైసీపీకి చెందిన రౌడీషీటర్ చెంగలాపురం సూరి ఫోన్ చేసి కాల్‌రికార్డు చేయాలని చెప్పి బెదిరించాడు. 'నీకు సపోర్టు ఎవరూ రారు. ఏమి చేసినా అడ్డొచ్చే మీ నాయకులెవరు? నాపైన ఇప్పటికే 20 కేసులు ఉన్నాయి' అంటూ తీవ్రస్థాయిలో దుర్భాషలాడాడు. కాగా, శ్రీకాకుళం నుంచి సైకిల్ యాత్రగా వస్తున్న టీడీపీ కార్యకర్తలను సుగాలిమిట్టలో బట్టలు ఊడదాయించి దాష్టికానికి పాల్పడిన చెంగలాపురం సూరినే.. ఇప్పుడు వివేకానందను బెదిరించారు.

ఎమ్మెల్సీ భరత్‌పై మరో రెండు ఫిర్యాదులు

రామకుప్పం, మే 14: ననియాలలో పోలింగ్ సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్సీ భరత్‌పై మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదులు ఇచ్చారు. వీరి ఫిర్యాదుల మేరకు వివరాలు.. టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుమారుడు చరణ్ సాయి ఓటువేసేందుకు వెళ్తుండగా ఎమ్మెల్సీ భరత్, అతని గన్‌మెన్, వైసీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, ననియాలతాండాకు చెందిన నాగరాజునాయక్, బధ్యానాయక్, సతీష్ హేళనగా మాట్లాడారు. అతడిని పిలిచి చితకబాదారు. హనుమంతు అనే వ్యక్తి ఓటువేసేందుకు వెళ్తుండగా కులం పేరుతో దూషించారు. దీనిపై ప్రశ్నించిన హనుమంతుపైనా దాడి చేశారు. ఈ మేరకు వీరిద్దరూ తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోమల మండలంలో 5 ఎన్నికల కేసులు

సోమల, మే 14: సోమల మండలంలో సోమవారం పలు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన ఘర్షణలతో 5 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు మంగళవారం తెలిపారు. ఆవులపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలు క్యూలైన్ వద్ద ప్రచారం చేస్తున్నారని పరస్పరం ఘర్షణ పడ్డారు. ఈఘర్షణలో మల్లేశ్వరంపురానికి చెందిన టీడీపీ కార్యకర్త గిరి నాయుడు గాయపడ్డారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. వైసీపీ వర్గం వారు ఫిర్యాదుతో మరో కేసు నమోదు జరిగింది. కందూరు హైస్కూల్ వద్ద జరిగిన వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు ఓబులేసు, నౌషాద్ గాయపడడంతో వేర్వేరుగా ఫిర్యాదు చేయడంతో రెండు కేసులు, వైసీపీ వర్గానికి చెందిన గాలి సురేశ్‌రెడ్డి గాయపడి ఫిర్యాదుతో కేసులు నమోదు చేశారు.

వైసీపీకి ప్రచారం చేసిన ఆర్టీసీ డ్రైవరు సస్పెన్షన్

పలమనేరు, మే 14: కుప్పం ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా పనిచేసే మున్నా అలియాస్ ఎస్‌ఏ బాషాను కుప్పం డిపో మేనేజర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరులోని గంటావూరు ఇందిరమ్మకాలనీలో వీరు నివాసం ఉంటున్నారు. ఈయన భార్య పలమనేరులో వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్. ఈనెల ప్రారంభంలో మున్నా అలియాస్ ఎస్‌ఏ బాషా వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. దీనిపై ఈనెల 4వతేది ఆంధ్రజ్యోతిలో 'వైసీపీ ప్రచారంలో ఆర్టీసీ ఉద్యోగి' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై కుప్పం డిపో మేనేజర్ విచారణ జరిపి వైసీపీ ప్రచారంలో మున్న పాల్గొన్నట్లు నిర్ధారించుకొని సస్పెండ్ చేశారు.

బాపలనత్తంలో టీడీపీపై దాడి

● నలుగురికి గాయాలు.. పోలీసులకు ఫిర్యాదు


తీవ్రంగా గాయపడిన కేశవులు, నందగోపాల్ - దాడిలో ఓ ఇంటి వరండాలో పడిన రాళ్లు

బైరెడ్డిపల్లె, మే 14: బైరెడ్డిపల్లె మండలం బాపలనత్తం గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ వారిపై వైసీపీ శ్రేణులు దాడి చేశారు. ఈ ఘటనలో కేశవులు, నందగోపాల్, పురుషోత్తం, టీడీపీ బూత్ ఏజెంట్ బాబు గాయపడ్డారు. బాధితులు తెలిపిన ప్రకారం.. నెల్లిపట్లలో పోలింగ్ ప్రక్రియ ముగిశాక తమ స్వగ్రామం బాపలనత్తంకు బయలుదేరారు. వైసీపీ శ్రేణులు దారికాచి.. తమను అడ్డగించి దాడిచేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అర్ధరాత్రి గ్రామంలో తమ ఇళ్లపై రాళ్లతో దాడిచేసి ఇళ్ల ముందు గేట్లు, వరండాలో ఫైకప్పుషీట్లు ధ్వంసంచేసి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దాడిలో గాయపడిన వారిని చికిత్స కోసం సోమవారం రాత్రి పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన కేశవులును మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. నందగోపాల్, పురుషోత్తం పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలింగ్‌కేంద్రం వద్ద వైసీపీశ్రేణులు ఓటర్లను ప్రలోభపెడుతుండడంతో తాను అభ్యంతరం తెలపడంతో ఈ దాడికి పాల్పడ్డారని, దీనిపై విచారణజరిపి తమపై దాడిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బూత్ ఏజెంట్ బాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘర్షణకు సంబంధించి టీడీపీ శ్రేణులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. తమపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారని వైసీపీ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. బైరెడ్డిపల్లెలో ఘర్షణలకు సంబంధించి వైసీపీ, టీడీపీకి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

జగన్ పాలనపై ఉన్న కసితోనే పెరిగిన ఓట్ల శాతం

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్పష్టీకరణ


మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మే 14: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనపై ప్రజల్లో ఉన్న కసి కారణంగానే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఇంత శాతం రాలేదు. కానీ, జగన్ పాలన కారణంగా ఇంత ఓటింగ్ శాతం వచ్చింది. ఆయనకూ కృతజ్ఞతలు తెలియజేయాలి' అని అన్నారు. పలమనేరు నియోజకవర్గంలో గత చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున పోలింగ్ శాతం జరిగిన సందర్భంలేదన్నారు. విదేశాల నుంచీ వచ్చి ఓటేయడమనేది ఆలోచించాల్సిన విషయమన్నారు. 'అర్బన్ ఏరియాల్లో ఎప్పుడూ 50నుంచి 62 శాతం మేరకు పోలయ్యేవి. అలాంటిది 80 నుంచి 90 శాతం పోలింగ్ జరగింది. అదీ పొద్దున 6గంటలకే పోలింగ్ బూత్‌లవద్దకు ఓటర్లు వచ్చారంటే ఏదోఒక మెసేజ్ తీసుకురావాలనే ఆలోచన వారిలో ఉంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అంతమంది ఓటేశారు. పోలింగ్ సరళి చూస్తే ఈ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుంది' అని పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగించుకొన్న ప్రతిఒక్కరికీ.. ఎన్నికల కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బాలాజి, గిరిబాబు, ఖాజాపీర్, శ్రీధర్, శ్రీనివాసులు, రహీం, చెన్నరాయప్ప, పురుషోత్తం, మహేష్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా పోలింగ్ నమోదు

● పీలేరులో 81, తంబళ్లపల్లెలో 80.31, మదనపల్లెలో 75.11 శాతం ● నిమ్మనపల్లె, కేవీపల్లెల్లో అత్యధికం, పీలేరులో అత్యల్పం

మదనపల్లె టౌన్, మే 14: మదనపల్లెలో ఎప్పుడు లేని విధంగా రికార్డు స్థాయిలో 75.11శాతం ఓటర్లు ఓటు వేశారు. నియోజకవర్గంలో 2,66,950 ఓటర్లు ఉండగా సోమవారం నిర్వహించిన పోలింగ్ లో 2,00,247 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో మదనపల్లె మున్సిపాలిటిలో 1,15,435 ఓటర్లకు గాను 77,969 మంది(67.54శాతం) ఓటు వేశారు. మదనపల్లె మండలంలో 85,726 మంది ఓటర్లకు గాను 77,969 మంది(78.42శాతం), నిమ్మనపల్లె మండలంలో 26089 ఓటర్లకు గాను 22,125 మంది(84.87శాతం), రామసముద్రం మండలంలో 39,360 మంది ఓటర్లకు గాను 32,929 మంది(83.66శాతం) ఓట్లు పోలయ్యాయి. ఇదిలా ఉండగా 2019 ఎన్నికల్లో మదనపల్లె నియోజకవర్గంలో పోలింగ్ శాతం 73.44శాతం పోలవగా ఈ సారి 75.11శాతం ఓట్లు పోలయ్యాయి. మదనపల్లె పట్టణంలో 2019లో 63.60శాతం పోలవగా ఈసారి 67.54 శాతానికి పెరిగాయి. అదే విధంగా నిమ్మనపల్లె మండలంలో 2019లో 84శాతం పోలవగా ఈ సారి 84.87శాతానికి పెరిగాయి. రామసముద్రం మండలంలో 2019లో 86.30శాతం ఓట్లు పోలవగా ఈసారి 83.66శాతానికి తగ్గాయి. మదనపల్లె మండలంలో 2019లో 77.37 శాతం ఓట్లు పోలవగా ఈ సారి 78.42శాతానికి పెరిగాయి. మొత్తం మీద 2014 సంవత్సరం ఎన్నికల్లో మదనపల్లె నియోజకవర్గంలో 69.57శాతం ఓట్లు పోలవగా, 2019 సంవత్సరం ఎన్నికల్లో 73.44శాతం, 2024 సంవ త్సరం ఎన్నికల్లో 75.11శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ శాతం పెరగడం చూస్తుంటే ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారో అన్నది జూన్ 4వ తేది తేలనుంది.



ములకలచెరువు పోలింగ్ కేంద్రంలో సోమవారం ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

కేవీపల్లెలో అత్యధికం .. పీలేరులో అత్యల్పం

పీలేరు, మే 14: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో పీలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 81.09 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,34,608 మంది ఓటర్లు ఉండగా 1,90,234 మంది ఓటు వేశారు. 1,14,962 మంది పురుష ఓటర్లకుగాను 93,854 మంది ఓటు వేశారు. 1,19,624 మంది మహిళా ఓటర్లు ఉండగా 96,364 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు 22 మంది ఉండగా 16 మంది ఓటు వేశారు. నియోజకవర్గంలోని కేవీపల్లె మండలంలో అత్యధికంగా 89.29 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా పీలేరులో 75.52 శాతం నమోదైంది. గుర్రంకొండలో 85.25 శాతం, కలకడలో 87.33, వాల్మీకిపురంలో 83.70, కలికిరిలో 79.29 శాతం పోలింగ్ జరిగింది. ఈవీఎంలు ఆలస్యంగా పనిచేయడం, ఓటర్లు అధికంగా తరలి రావడంతో నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సాయంత్రం 6 గంటలలోపు పోలింగ్ కేంద్రంలోనికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అధికారులు ఓటు హక్కు కల్పించారు.


నియోజకవర్గంలోని మండలాల్లో పోలింగ్ వివరాలు

● గుర్రంకొండ మండలంలో మొత్తం 17,284 మంది పురుష ఓటర్లు ఉండగా వారిలో 14,833 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 17,491 మంది మహిళలు ఉండగా వారిలో 14,812 మంది ఓటు వేశారు. ఇతరులు ఇద్దరు ఉండగా ఒక్కరు మాత్రమే ఓటు వేశారు.

● కలకడ మండలంలో 13,829 మంది పురుష ఓటర్లు ఉండగా వారిలో 11,831 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 14,084 మంది మహిళలు ఉండగా వారిలో 11,835 మంది ఓటు వేశారు.

● కేవీపల్లె మండలంలో 15,971 మంది పురుష ఓటర్లు ఉండగా వారిలో 13,539 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 15,938 మంది మహిళలు ఉండగా వారిలో 13,185 మంది ఓటు వేశారు.

● వాల్మీకిపురం మండలంలో 17,686 మంది పురుష ఓటర్లు ఉండగా వారిలో 14,989 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 18,846 మంది మహిళలు ఉండగా వారిలో 15,589 మంది ఓటు వేశారు. ఒక్కరు మాత్రమే ఇతరులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు.



● కలికిరి మండలంలో 19,767 మంది పురుష ఓటర్లు ఉండగా వారిలో 15,716 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 20,911 మంది మహిళలు ఉండగా వారిలో 16,538 మంది ఓటు వేశారు. ఇతరులు 8 మంది ఉండగా వారిలో ఏడుగురు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● పీలేరు మండలంలో మంది 30,425 మంది పురుష ఓటర్లు ఉండగా వారిలో 22,946 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 32,354 మంది మహిళలు ఉండగా వారిలో 24,405 మంది ఓటు వేశారు. ఇతరులు 10 మంది ఉండగా ఏడుగురు మాత్రమే ఓటు వేశారు.

ములకలచెరువులో: తంబళ్లపల్లె నియోజకర్గంలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. జిల్లాలోనే అత్యధికంగా ఇక్కడ పోలింగ్ శాతం నమోదైంది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 80.31 శాతం పోలింగ్ నమోదైంది. తంబళ్లపల్లె నియోజవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, కరబలకోట, బి.కొత్తకోట పెద్దమండ్యం మండలాల్లోని 236 పోలింగ్ కేంద్రాల్లో 2,24,802 మంది ఓటర్లు ఉండగా 1,86,894 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో 84.33 శాతం నమోదు కాగా ఈ సారి పోలింగ్‌తో పోల్చితే 4.02 శాతం తక్కువగా నమోదైంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లులో మాత్రం చెదరుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల కంటే ఈ సారి ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పెద్దతిప్పసముద్రం తంబళ్లపల్లె, కురబలకోట మండలాల్లో సాయంత్రం కురిసిన వర్షానికి పోలింగ్ ఆలస్యంగా జరిగింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది.

కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంల తరలింపు



ఈవీఎంలను కంటైనర్లలోకి ఎక్కిస్తున్న ఆర్‌వో హరిప్రసాద్, ఏఆర్‌వో రమాదేవి

మదనపల్లె టౌన్, మే 14: మదనపల్లె అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఏపీ ఎల్‌పీ- 164(ఎమ్మెల్యే), హెచ్ వోపీ- 24(ఎంపీ) ఎన్నికల పోలింగ్ ఈవీఎంలను కట్టుది ట్టమైన భద్రత మధ్య మదన పల్లె నుంచి రాయచోటికి తరలిం చారు. సోమవారం నియోజకవ ర్గంలోని 260 పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు మదనపల్లె స్ట్రాంగ్ రూమ్ చేరుకునే సరికి అర్ధరాత్రి అయింది. దీంతో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ వాటిని రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. అనంతరం మంగళవారం స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఈవీఎంలు, బ్యాలెట్ యూని ట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ యంత్రాలను ఐదు కంటైనర్లలో ఎక్కించా రు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 260, పార్లమెంట్ ఎన్నికలకు సంబం ధించి 260 ఈవీఎం యంత్రాల యూనిట్లను ఐదు కంటైనర్లలో ఎక్కించి ఆర్‌వో సీలు వేశారు. వాటిని సాయుధ బలగాల భద్రత మధ్య వన్‌టౌన్ సీఐ ఉజాల వలీబషు, తాలూకా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ఎస్కార్ట్ వెంట రాగా రాయచోటికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరులో పోలింగ్ ముగిసిన తరువాత నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి అధికారులు ఈవీఎంలను పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తరలించా రు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈవీఎంలు అక్కడికి చేరేసరికి మంగళవారం ఉదయం అయింది. వెంటనే ఉదయం అక్కడి నుంచి గట్టి బందోబస్తు మధ్య వాటిని పీలేరు ఆర్‌వో ఫర్మాన్ అహ్మాన్ ఖాన్, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి పర్యవేక్షణలో జిల్లా కేంద్రమైన రాయచోటికి పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య వాటిని తరలించారు.

ములకలచెరువులో: తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు జిల్లా కేంద్రమైన రాయచోటికి చేరాయి. పోలింగ్ అనంతరం ఈవీఎంలు కురబలకోట మండలం అంగళ్ళు మిట్స్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంకు చేరాయి. ఈ క్రమంలో మంగళవారం ఈవీఎంలను ప్రత్యేక కంటైనర్లలో జిల్లా కేంద్రమైన రాయచోటికి పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య వారిటిని తరలించారు.

ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థులు

కురబలకోట, మే 14: హైదరాబాద్ లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన డీఆర్‌డీవో ఇంటర్న్‌షిప్‌కు ఇద్దరు మిట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో తృతీయ సంవత్సరం ఈసీఈ విభాగానికి చెందిన చైతన్య లక్ష్మి, భవ్యసాయిలు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు 3నెలలు పాటు ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో స్టడీ ఆఫ్ లింక్స్ ఎఫ్‌పీజీఏ అండ్ ఇంప్లిమెంటింగ్ కస్టమ్ ఐపీ కోర్ యూసింగ్ లింక్స్ ప్లాట్‌ఫామ్‌పై పరిశోధనలు చేశారన్నారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ .విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ అధ్యాపకులు అభినందించారు.

ఓటింగ్ పెరగడమే విజయసూచికకు నిదర్శనం

● మదనపల్లె కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 14: మదనపల్లె నియోజకవర్గంలో ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం చూస్తుంటే టీడీపీ గెలుపు తథ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం సుభాష్‌రోడ్డులోని ఆయన నివాసం వద్ద కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నిత్యం తనతో పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే తన గెలుపునకు నాంది అన్నారు. వైసీపీ నాయకులు ఇసుక, మద్యం, భూ మాఫియాలతో సంపాందించిన డబ్బులను విచ్చలవిడిగా ఓటర్లకు భారీగా పంపిణీ చేసిందన్నారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ రూ.8.50లక్షలతో పట్టుబడిన వైసీపీ కౌన్సిలర్‌పై ఒక కేసు, పోస్టల్ బ్యాలెట్‌లకు డబ్బులు పంచుతూ మీడియాకు చిక్కిన వ్యక్తిపై మరో కేసు నమోదైందని గుర్తు చేశారు. కాని ఓటర్లు కూటిమి వైపే మొగ్గుచూపారన్నారు. పడిపోతున్న వైసీపీ అభ్యర్థి నిస్సార్‌అహ్మద్‌ను నిలబెట్టడానికి మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి ఎన్ని జాకీలు పెట్టి పైకి లేపినా మదనపల్లెలో వైసీపీ పడిపోవడం ఖాయమన్నారు. వైసీపీ అరాచక పాలన చూసి ఓటర్లు కసిగా వచ్చి ఓట్లు వేశారన్నారు. మదనపల్లె పట్టణంలో ఓటింగ్ శాతం పెరగడమే దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 160 స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని చంద్రబాబు సీఎం కావడమే తరువాయి అన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వ్యతిరేకత చాలా వుందని, పోస్టల్ బ్యాలెట్‌లను అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు వినియోగించుకోవడమే దీనికి తార్కాణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునబాబు(గాంధి), ఫణికర్‌రెడ్డి, విద్యాసాగర్, వేణు, మధుబాబు, చుక్కా విజయ్, జంగాల వెంకటరమణ, కత్తి లక్ష్మన్న, పులి మహాలక్ష్మి, తలారి రాధ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో కమలం వికసిస్తుంది



మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మే 14: రాజంపేట పార్లమెంట్‌లో కమలం వికసించడం ఖాయమని రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు తథ్యమని టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజంపేటకు పదేళ్ల ఎం పీగా పనిచేసిన మిధున్‌రెడ్డి ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి చేయడంలో విఫలమ య్యారని, కేవలం వారి ఆస్తులు, కాంట్రాక్టులు సంపాదించుకోవడానికే పనిచేశారన్నారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి నిజాయితీ పనిచేస్తారని, ఆయన ఎంపీగా గెలిచి మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరును అభివృద్ధి బాటలో నడిపిస్తారన్నారు. అలాగే మదనపల్లె ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా గెలుపు నల్లేరు మీద నడకే అన్నారు. పోలింగ్ కేం ద్రాల వద్ద ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్లు చైతన్యం చూస్తే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సమావేశంలో రాజంపేట టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రమేశ్ దేవా, అన్వర్‌బాషా, నరసింహులు, లోకేశ్, సోమశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

నానిపై దాడి అప్రజాస్వామికం

కురబలకోట, మే 14: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ మూకలు దాడి చేయడం అప్రజాస్వామికమని టీఎస్ఎస్వీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కట్టా దొరస్వామి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నేతలు ఈవీఎంలను మార్చుతున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన ఆయనపై కత్తులు, రాళ్ళు, బాటిళ్ళతో దాడి చేయడం నీతిమాలిన చర్యఅన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ వారు దాడులు చేశారని, ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతుడు సాయి (ఫైల్ ఫొటో)

పీలేరు, మే 14: పీలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయి(36) అనే యువకుడు మంగళవారం దుర్మరణం చెందాడు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సాయి ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యం లో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంలో పీలేరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన డంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు సాయిని హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. సాయికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని దుర్మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పీలేరు ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధైర్యపడవద్దు.. కూటమిదే విజయం

●కూటమి నాయకులు, కార్యకర్తలతో మాజీ సీఎం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ●నగరిపల్లెలో నల్లారి సోదరులను కలిసిన శ్రేణులు



వాల్మీకిపురంలో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన నాయకులు



పీలేరు: నగరిపల్లెలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డితో పీలేరు నేతలు

పీలేరు/వాల్మీకిపురం, మే 14: ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని రాష్ట్రం లో ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారన్నారని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని మాజీ సీఎం, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కు మార్‌రెడ్డి కూటమి శ్రేణులకు చెప్పారు. ఎన్నికల పోలింగ్ అనంతరం మంగళ వారం పీలేరు, వాల్మీకిపురం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలికిరి నగిరిపల్లెకు తరలివెళ్లి బీజేపీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, నగిరిపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలను కలిసి పోలింగ్ అనంతర విషయాలను తెలియజేశారు. ఈసందర్భంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నాయకులతో మాట్లాడుతూ ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని తెలియజేసినట్లు చెప్పార న్నారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకోసం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారన్నారు. వాల్మీకిపురం పోలింగ్ కేంద్రాలలో వైసీపీ దౌర్జన్యాలు తెలిశా యని త్వరలోనే లెక్క సరిచేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎవ్వరూ భయపడాల్సిన పని లేదని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, పీలేరు మైనార్టీ పార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు కృష్ణారెడ్డి, పులి సత్యారెడ్డి, రాజేంద్రా చారి, పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, మురళి, చంద్రమౌళి, చాను, సాదిక్, హుస్సే న్, మస్కట్‌మస్తాన్, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, మనోహర్, కువైట్ ఆది, చిరంజీవి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా పీలేరు మండలానికి చెందిన అధిక శాతం టీడీపీ నేతలు నగిరిపల్లెకు చేరుకుని నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని కలిసి తమ తమ ప్రాంతాల్లో పోలింగ్ సరళిని వివరించారు. వైసీపీ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత నిన్నటి పోలిం గ్‌లో ప్రజల్లో స్పష్టంగా కనిపించిందని, మంచి మెజారిటీతో విజయం సాధిం చడం ఖాయమని వారు కిశోర్‌కు తెలిపారు. చాలా మంది రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని కూడా కలిసి తమ ప్రాంతాల్లోనూ ఆయనకు మంచి ఆదరణ లభించిందని తెలిపారు.

టీడీపీ నాయకులతో పోటెత్తిన నగరిపల్లె

కలికిరి, మే 14: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులతో పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం నగరిపల్లె పోటెత్తింది. దాదాపు అన్ని గ్రామాలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆయా గ్రామాల్లో పోలింగ్ జరిగిన తీరును వివరించారు. టీడీపీ శ్రేణులంతా అత్యంత ఉత్సాహంగా ప్రతి గ్రామంలోనూ టీడీపీ మెజారిటీ సాధిస్తుందని ధీమ వ్యక్తం చేశారు. రాత్రి పొద్దుపోయే వరకూ ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారని చెప్పారు. పోలింగ్ శాతం కూడా నియోజకవర్గంలో గణనీయంగా పెరగడంతో టీడీపీ భారీ మెజారిటీ సాధిస్తుందని వివిధ రకాల విశ్లేషణలతో చెప్పారు. కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డితో కూడా పార్టీ శ్రేణులు సమీక్షలు జరిపారు. అనంతరం రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని కూడా కలిసి పోలింగ్ పూర్వాపరాలను వివరించారు.



కలికిరి: తనూజా రెడ్డితో పోలింగ్ విశేషాల గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు

గుర్రంకొండలో: ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో గుర్రంకొండ, కలకడ మండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు మంగళవారం కలికిరిలోని మాజీ సీఎం, రాజంపేట కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలను కలిశారు. ఈ క్రమంలో మండలంలోని జరిగిన పోలింగ్ సరళిని గురించి నాయకులను అడిగి నల్లారి సోదరులు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు వారు అభినందనలు తెలిపారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకల దాడి

●పరామర్శించిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా

నిమ్మనపల్లి, మే 14: టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకలు దాడిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మద్యంవారిపల్లిలో ఏర్పాటు చేసిన బూత్ 221లో సోమవారం పోలింగ్ జరుగుతుండగా వెంగంవారిపల్లి మాజీ సర్పంచ్ రుఖియాబేగం, ఆమె అనుచరులు పోలింగ్ బూత్ వద్ద వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తుండగా అక్కడకు వెళ్లిన శివకుమార్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డిలు బూత్ వద్ద ప్రచారం చేయారాదని తెలుపగా రుఖియాబేగం అనుచరులు ఆగ్రహంతో రఫి, షాదిక్, అమ్మద్ తదితరులు దాదాపు 10మందితో కలసి వారిని కింద పడేసి దాడి చేశారని తెలిపాడు. విషయం తెసుకొన్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా హుటాహుటిన వెంగంవారిపల్లికు చేరుకొని వైసీపీ మూకల దాడిలో గాయపడిన వారిన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ఓటమిని భరించ లేక టీడీపీ నాయకులపై దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీకి కొద్ది రోజులు మాత్రమే సమయం ఉందని జూన్4న టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం దాడి ఘటనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ ఏజెంట్‌పై వైసీపీ నాయకుల దాడి



వైసీపీ నాయకులు దాడిలో గాయపడిన చిన్నరెడ్డెప్పరెడ్డి

గుర్రంకొండ, మే 14:భారతీయ జనతా పార్టీ ఏజెంట్‌పై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి తరిగొండలో చోటు చేసుకుంది. బాధితుని వివరాల మేరకు మండలంలోని తరిగొండ పంచాయతీ టి.రెడ్డివారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్పరెడ్డి తరిగొండ పోలింగ్ బూత్ 36లో బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి తరఫున పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 8 గంటల వరకు ఏజెంట్‌గా ఉండి పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో అప్పటికే తరిగొండ బస్టాండులో ఉన్న వైసీపీ నాయకులు కక్షతో చిన్నరెడ్డెప్పరెడ్డిపై దాడి చేశారు. ఈ దాడిలో చిన్నరెడ్డెప్పరెడ్డి తలపై ఇనుపరాడ్‌తో కొట్టారు. దీంతో బాధితుని తలపై తీవ్ర రక్త గాయమైంది. విషయం తెలుసుకున్న బాధితుడి అన్న వేణుగోపాల్‌రెడ్డి అక్కడి రావడంతో అతనిపై కూడా దాడి చేశారు. అనంతరం గాయపడిన బాధితుడ్ని వాల్మీకీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి
జయంత్యుత్సవాలు ప్రారంభం



కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మదనపల్లి అర్బన్ మె 14 : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయని ఆర్యవైశ్య సంఘం మదన పల్లి అధ్యక్షుడు పొన్నగంటి ఓంప్రకాష్ తెలిపారు . ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వాసవీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు . ఇందులో భాగంగా మంగళవారం నుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహిం చనున్నారు మంగళవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమై పంచామృతంతో పాటు కుంకుమార్చన నిర్వహించారు . 16వ తేదీ మహామంగళ హారతితో పాటు వాసవీ సహస్రనామ పారాయణం ఉంటుందని తెలిపారు. 17వ తేదీ చిన్నారి దేవతశ్రీ గాత్రకచేరి, అన్నమాచార్యుల కీర్తనలు నిర్వహిస్తారు. 18వ తేదీ అమ్మవారి జయంత్యుత్సవాల సందర్భంగా మదనపల్లిలోని ఆర్యవైశ్యుల దుకాణాలకు సెలవు ప్రకటించారు. 18న ఉదయం ఆర్యవైశ్య హాస్టల్ నుంచి ఆర్యవైశ్య యువకులు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు అలాగే మధ్యాహ్నం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో అన్నదానం చేయనున్నారు . రాత్రికి అమ్మవారిని పల్లకిలో ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం దేవత సతీష్, సూరే గిరిధర, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

నేటి నుంచి గంగమ్మ జాతర ప్రారంభం

రైల్వేకోడూరు, మే 14: పట్టణంలో గంగమ్మ జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దీంతో ఆలయం వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి తప్పెట్లు, గంగమ్మ వేషాలు, డీజే తదితరాలు ఏ ర్పాటు చేస్తున్నారు గురువారం గంగమ్మనుఊరేగిస్తారు. ఉమ్మడి కడప జిల్లానే కాకుండా చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన భక్తులు తరలివస్తారు. 17న ఉదయం అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది దాతలు గంగమ్మకు బంగారు కిరీటం చేయిం చారు.